ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
7 ఆగస్టు, 2011

ENTERED

స్వాములోరి సామ్రాజ్యాలు

హ్యాపీ బర్త్‌డే

(2011 ఆగస్టు 7 నుంచి 2011 ఆగస్టు 13 వరకు)

వి. నక్షత్ర
1సం॥, ఆగస్టు-12
ధనలక్ష్మి-నాగేంద్రకుమార్
చెన్నై-తమిళనాడు

ఆర్. అభిలాష్(చిన్ను)
4సం॥,ఆగస్టు-8
అరుణజ్యోతి-వెంకటేష్
గోల్కొండచౌరాస్తా-హైదరాబాద్



వి. మణిదీప్తి
2సం॥, ఆగస్టు-12
భాగ్యలక్ష్మి-నరసింహారావు
తాటిగుమ్మి-కృష్ణా

ఎన్. సాత్విక్
2సం॥ ఆగస్టు-8
అరుణ-రామ్‌జీ
మల్కాపురం-విశాఖ

ఆర్. ఉదయ్‌సాయికుమార్
1సం॥,ఆగస్టు-12
రేణుక-వెంకటాచారి
చంద్రుగొండ-ఖమ్మం

ఆర్. అరుణ్‌చంద్
9సం॥, ఆగస్టు-7
అపర్ణ-లింగరాజు
భీమడోలు-ప॥గో

ఎం. యువన్(విక్కీ)
1సం॥ ఆగస్టు-2010
అమరావతి-రమేష్
కొండారెడ్డిపల్లి-వంగూరు

కె. టి. తేజశ్విని
ఆగస్టు-13
చంద్రమౌళి
అక్కయ్యపాలెం-విశాఖ

ENTERED

మనలో మాట

కుర్సీ కా కహానీ!

అయస్కాంతాల్లోకెల్లా పెద్ద అయస్కాంతం భూమి. ధరణిలో అపారమైన గనులూ, మణులూ నిక్షిప్తమై ఉన్నాయ్! ఖనిజాలూ, వనరులూ కొలువు తీరి ఉన్నాయ్! ఇప్పుడు వాటన్నింటినీ మించినట్లుగా వుంది రియల్ ఎస్టేట్ వ్యాల్యూ. అంత విలువైంది కాబట్టే- ప్రతిదీ భూమి చుట్టూ తిరుగుతోంది. భూమ్మీద ఉన్న ప్రతి ఒక్కరికీ భూమి తప్పనిసరి అవసరం. నేల విడిచి సాము చేయడం మనిషికి అట్టే మంచిది కాదు కదా.

హద్దులు లేని భూమిని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే అధికారాన్నిచ్చే కుర్చీ కావాలి. లేదా ఇచ్చింది పుచ్చుకొని జో హుకుం అంటూ సలాం కొట్టేవాడు కుర్చీలో కూర్చుని వుండాలి. రెంటిలో ఏది వున్నా భూమిని కూడా అడ్డంగా బద్దలు కొట్టేంత బలం వచ్చేస్తుంది...వందలు వేల ఎకరాలు హామ్మని మింగేసేంత ఆకలీ, ఆసాంతం హరాయించుకునే శక్తీ పుట్టుకొచ్చేస్తాయి. ఇక దాంతో, ఎంత తవ్వుకుంటే అంత..! ఎంత తింటే అంత..!! కావలిస్తే- కళ్లెదుటే నడుస్తున్న క'ర్నాటకం' చూడండి... దేశం నిండా అల్లుకొన్న భూ'స్వాము'లను చూడండి. స్కాములను చూడండి. అవసరం లేకున్నా వేలకు వేల ఎకరాలు విశ్రమించిన ఆశ్రమాలను చూడండి. పరిశ్రమలను చూడండి.

లోకాయుక్త లోకానికి చాటిచెప్పిందాకా- కర్నాటకలో పాతాళానికి పాకిన పాపం గురించి పువ్వు పార్టీ వాళ్లకి ఆ విషయం తెలీనేలేదు పాపం...! ఆ మాటకొస్తే హస్తి, హస్తం, ఉదయించే ఆదిత్యం ఎవరు మాత్రం తక్కువ. భూముల పందేరంలో, ప్రజాధనం అపహరించుకుపోవడంలో ఎవరికి వారిదే అందె వేసిన చేయి. 'భాండం బద్దలయింది. ఇక గద్దె దిగు యెడ్డీ' అంటే ఆషాడం వెళ్లేదాక కుదరదన్నాడు. శ్రావణం వచ్చేదాకా అంపశయ్య దగ్గర జాగారం తప్పలేదు అధినాయకులకు.

అధికార దండంతో ఆస్తులు కూడేసే నాయకులకు కుర్చీ దిగమంటే కలిగే బాధ ఇంతా అంతా కాదు. అందుకనే పాపం... యడ్యూరప్ప తాను దిగిన కుర్చీ తన అనుయాయికే ఇవ్వాలని కర్చీఫ్ వేసి గెలిచాడు. ఆర్నెల్ల తరువాత ఆ కుర్చీ తనదేనని ఆఫర్ కూడా పెట్టుకున్నాడు. అవినీతితో అందలాలెక్కే బాపతంతా ఇంతే! అధికార అండ లేకపోతే స్వీయ జనోద్ధరణ సాధ్యం కాదని వాళ్ల అనుభవం. ఈ బాపతుకంతా పదవి లేని రాజకీయం - ప్రాణం లేని కాయం.

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	4
ఈ పేజ్	...	8
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
కొత్తపుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

కొవ్వు పన్ను...
అనాథ టూరిజం ... 3

తెలుసుకుందామా ... 6
స్నేహ బంధమూ...

సినిమా ... 10
నా కథలన్నీ
ఆలోచనల నుండి అల్లుకున్నవే

విరాసం ... 20
ఆరోగ్యానికి భరోసా



ఆకర్షించిన వెయ్యేళ్ల ఆలయం

ఈ వారం సంచికలో వెయ్యేళ్ల ఆలయ విశేషాలు ఆకర్షించాయి. కనువిందు చేసే ఇటువంటి ఆలయాలను తప్పక దర్శించాల్సిందే.

నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం.

కనువిప్పు

అట్టమీది కథ 'మీడియా డాన్' బాగుంది. ప్రజల కోసం, ప్రజా సమస్యలను అందరికీ చూపించడం కోసం ఎలక్ట్రానిక్ మీడియాలు వచ్చాయి. వీలైనంత వరకు ఆ సమస్యలకు పరిష్కారం చూపించే బాధ్యత కూడా ప్రసార మాధ్యమాలపై ఉంది. రేటింగ్ కోసం అభూత కల్పనలు చూపించి రూపర్ట్ మర్డోక్ బురదలో పడ్డాడు. ఇలాంటి రోగాన్ని అంటించుకున్న ఛానళ్లు తెలుగులో కూడా ఉన్నాయి. అటువంటి ఛానళ్లు ఇకనైనా కళ్లు తెరవాలని ఆశిస్తున్నాం. నేడు ప్రతి నాలుగిళ్లలో ఒక ఇంట్లో మందు బాబులు ఉంటున్నారు. అలాంటి వాళ్లు పెళ్లాన్ని, పిల్లల్ని ఏడిపిస్తుంటారని 'విజయం' కథ కళ్లకు కట్టినట్లు చూపించింది. 'హ్హ... హ్హ' కడుపుబ్బా నవ్విస్తోంది.

మోతి మోహనరంగా, సూర్యాపేట.

అద్భుతమైన ఆర్ట్

చరిత్రకు సాక్ష్యాలు ఉండాలంటే బృహదీశ్వరాలయం వంటి వెయ్యేళ్ల చరిత్ర గల ఆలయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. 'వికాసం' శీర్షికలో శరీర భాష అంశం బాగుంది. అగ్గిపుల్ల ఆర్ట్ అద్భుతంగా ఉంది. నువ్వు నీ తల్లిదండ్రులను ఎలా చూస్తావో నిన్ను నీ పిల్లలూ అలాగే చూస్తారనడం బాగుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ఆదర్శం

డబ్బు సంపాదన కోసం కాకుండా సేవాభావంతో ఇంజినీరింగ్ చదివే విద్యార్థి హరిప్రసాద్ తన మిత్రబృందంతో చేస్తున్న సేవలు అభినందనీయం. నిర్మల్ హృదయ్ సంస్థ సేవా కార్యక్రమాలు చాలా మందికి ఆదర్శం. 'శరీర భాష చాలా గొప్పది' వ్యాసం, కవితలు' బాగున్నాయి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

కథ బాగుంది

అట్టమీది కథ 'మీడియా డాన్' ఆసక్తిదాయకంగా ఉంది. 'బాలనేస్తాలు'లో నత్తగుల్లకు దారిలో ఎదురైన ఆటంకాన్ని చాకచక్యంగా అధిగమించడం గమ్మత్తుగా ఉంది. 'అగ్గిపుల్ల ఆర్ట్' కనువిందు చేసింది. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లోనూ అనేక మోసాలు, ప్రమాదాలు పొంచి ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. 'ఈ పేజ్' ద్వారా తెలియని విషయాలనెన్నింటినో తెలుసుకుంటున్నాం. 'యువసేవ' మిత్రబృందాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం. వారి ఫోన్ నెంబర్లనూ ప్రచురించడం బాగుంది. వెయ్యేళ్లనాటి ఆలయ వైభవం నేటికీ అదే ఆదరణ పొందడం గొప్ప విషయం. కవితలు బాగున్నాయి. 'సినిమా కబుర్ల'లో విలక్షణ వేషధారుల సంగతుల్ని అక్షరబద్ధం చేశారు. శాంతిశ్రీ 'విజయం' కథ నచ్చింది. శరీర భాషను పరిశీలించాలే కానీ ఎన్నో సందేశాలు, అనుభూతుల్ని ఆవిష్కరిస్తాయని 'వికాసం' ద్వారా చక్కగా చెప్పారు. 'యథారాజా తథా ప్రజా' అన్న మనలో మాట యదార్థం.

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

ఇంకెన్నో...

శాంతిశ్రీ కథ 'విజయం' చాలా ఎమోషనల్‌గా ఉంది. ఇంకెన్నో మంచి కథలు రావాలని ఆశిస్తున్నాం.

బి.గీతిక, పాలకొల్లు, ప.గో.

వివరాల మాలిక

ఆదివారం అనుబంధంలో ప్రతి ఒక్కఅంశమూ ప్రత్యేకతను సంతరించుకుంటోంది. ముఖ్యంగా కవర్‌స్టోరీ 'మీడియా డాన్' ఆకర్షణీయంగా, ఆలోచింపజేసేదిగా

ఉంది. లోకంలోని అవకతవకల్ని అందరికీ తెలియజేయాల్సిన మీడియాలోనే ఇంత అవినీతి రాజ్యమేలితే ఎలా? దీన్ని బట్టే ప్రపంచంలో అవినీతి ఎంతగా ప్రబలిందనేది అర్థమౌతోంది. దీనికి సంబంధించిన అనేక విషయాలు కళ్లకు కట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా మర్డోక్ ఎన్ని రకాల అడ్డదారుల్లో, ఎంత సంపాదించాడనేది ఈ వ్యాసం వివరించింది. సమాజంలో మాఫియా గ్యాంగ్‌ల పేరే విన్నాం గానీ ఇలా ప్రసార సాధనాల ద్వారా కూడా హాయిగా, జాల్సాగా అక్రమార్జన చేయొచ్చంటే ఆశ్చర్యంగానూ, అసహ్యంగానూ ఉంది. ఇలాంటి వ్యాసాన్ని ప్రచురించి, నిజానిజాలు తెలిపినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. 'మనలో మాట'... అమ్మానాన్నల ప్రేమ ముందు ఎన్ని సంపదలున్నా దిగదుడుపే.

టి.వి.డి.ఎస్.సీతారామారావు, విజయవాడ. ★





కొవ్వు పన్ను... అనాథ టూరిజం

కాలే కడుపుకు గంజి ఎలా దొరుకుతుందా అని ఎదురు చూస్తున్న వారు ప్రపంచంలో వందకోట్ల మంది ఉంటే తిన్నదరగక, అవసరానికంటే ఎక్కువ తిని ఒళ్లు పెంచుకొని తమకు తాము సమస్యగా మారటమేగాక సమాజంపై 'భారం' మోపి తిరుగుతున్నవారు మరో వందకోట్ల మంది ఉన్నారు. చరిత్రలో ఔరంగజేబు జుట్టు పన్ను వేశాడని కొందరు చరిత్రకారులు చెప్పారు. ఇప్పుడు ప్రపంచంలో తొలిసారిగా 'కొవ్వు' పన్ను విధించేందుకు గతనెలలో ఒక బిల్లును హంగరీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎందుకయ్యా అంటే ఆరోగ్య సంరక్షణకోసమట. కూల్‌డ్రింక్‌లు, చాకొలెట్‌బార్‌లు, బంగాళాదుంప కరకరలు జనానికి 'కొవ్వెక్కిస్తున్నాయని' పార్లమెంటు ఆందోళనకు గురైంది. కొవ్వు ఎక్కువగా ఉండే ఉప్పు, పంచదారపై పన్ను విధించి ఏడాదికి 111 మిలియన్ యూరోల ఆదాయాన్ని పిండాలని చూస్తోంది. తూర్పు ఐరోపాలో 'సోషలిజాన్ని' కాలదన్నుకున్న దేశాలలో ఒకటైన హంగరీ ఆ తరువాత పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. దాన్నుంచి బయట పడేందుకు మార్గాలేమిటా అని చూస్తే 'కొవ్వు' కనిపించింది.

మరో పూర్వపు సోషలిస్టు దేశం రుమేనియా ఐఎంఎఫ్ షరతులను అమలు జరిపేందుకు 'కొవ్వు' కరిగించే పేరుతో 700 మిలియన్ యూరోల పన్ను వేసేందుకు ముందుకు దూకబోయి నాలుక కరుచుకొని హన్నన్నా!! అసలే ధరల పెరుగుదలతో ఉన్న బక్కపలచ జనం మాకుకొవ్వేమిటంటూ' 'తాట' తీస్తారనే భయంతో వెనక్కు తగ్గింది.

తమ ఉత్పత్తులపై పన్ను వేయటం 'వివక్ష' పాటించటమే అంటూ ఐరోపా ఆహార, పానీయ పరిశ్రమ మండిపడుతోంది. ఈ పన్ను 'పేదల'ను ఆకలితో మాడ్చివేస్తుందని 'మొసలి కన్నీరు' కార్చింది. పన్ను వేస్తే 'కొవ్వు' కరుగుతుందని ఎలా చెప్పగలరంటూ వివిధ దేశాల సమాచారాన్ని 'తవ్వి' తీస్తోంది. డెన్మార్క్‌లో 1922 నుంచి కాండీలపై పన్ను విధించినప్పటికీ 'ఒళ్లు పెంచేవారు' ఎందుకు తగ్గలేదో చెప్పండంటూ నిలదీస్తోంది. హంగరీలో ఎక్కువగా తినే 'వేపుళ్లను వదలి వేయటం ఏమిటని రుస రుసలాడుతోంది.

ప్రపంచంలోకెల్లా భారీకాయాలలో అమెరికా అగ్రస్థానంలో ఉండగా ఐరోపాలో దాని స్నేహితురాలు బ్రిటన్ ముందుంది. సాధారణ రోగాలతో వచ్చే వారిని చూడాలా, 'కొవ్వు' కరగించటానికి ప్రాధాన్యత ఇవ్వాలా అని అక్కడి టోరీలు, లేబర్లు తలల బదులు 'పొట్టలు' పట్టుకుంటున్నారు. జాతీయ ఆరోగ్య సేవలకు కేటాయిస్తున్న దానిలో మూడోవంతు 'ఊబకాయాలకే' ఖర్చవుతోందని గగ్గోలు పెడుతున్నారు.

అసలు ఇంతకూ 'కొవ్వు' పెంచే ఆహార పదార్ధాలను తినేవారిపై 'పన్ను' వేయటం ఎందుకు? అసలు ఆ పదార్ధాల తయారీనే నిషేధించవచ్చు కదా అని ఎవరైనా అమాయకంగా ప్రశ్నించవచ్చు. ఆ మాత్రం వారికి తెలియకనా? కొవ్వు పెంచే ఆహార పదార్ధాలు తయారు చేస్తున్నది సాదాసీదా కంపెనీలు కాదు. అవసరమైతే దేశాలకు దేశాలనే కొనుగోలు చేయగల 'బల'శాలులు. అవి తమ ఆహార పదార్ధాలు ద్వారా జనానికి 'కొవ్వెక్కించగలవు, తమ ఆసుపత్రుల ద్వారా 'కొవ్వు' కరిగించాగలవు. అంతా వ్యాపారం, లాభాలే, లాభాలు.

పర్యావరణ పరిరక్షణ మాత్రమే పట్టిన కొందరి ఆనందం ఇలాగే ఉంది మరి. ఐరోపాలో గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం కారణంగా 'గాలి కాలుష్యం' తగ్గిందని సంబర పడుతున్నారు. విద్యుత్ వినియోగం తగ్గిన కారణంగా ఉత్పత్తి కేంద్రాలనుంచి విడుదలయ్యే సల్ఫర్, నైట్రోజన్ ఆక్సైడ్స్ వంటి కాలుష్యం తగ్గినట్లు తమ పరిశోధనలో తేలిందని యూరోపియన్ ఎన్విరాన్‌మెంట్ ఏజన్సీ పేర్కొన్నది.

మా డ్రింక్ తాగితే క్షణాల్లో 'శక్తి'... మా నూనె వాడితే 'కొలెస్ట్రాల్' మటుమాయం, యాంటీ టాక్సిడెంట్స్ ఉన్నాయి, వేళ్లాడే బాబూ వేళ్లాడే బాబు, మా నూనె రాస్తే బట్టతలపై జుట్టు మొలవటం గ్యారంటీ, మా సబ్బు వాడితే రోజంతా సువాసనలు వెదజల్లుతాయి, మా ఆహార ఉత్పత్తులు 'డైటిక్' 'గ్లుటెన్ ఫ్రీ', స్లిమ్మింగ్, స్పోర్ట్స్ ఫుడ్స్ అంటూ తమ ఉత్పత్తుల గురించి కంపెనీలు కొట్టే గప్పాలు వినియోగదారులను మభ్యపెట్టేవే అని తెలిసినప్పటికీ ప్రభుత్వ నిబంధనల్లో లోపాలను ఉపయోగించుకొని కంపెనీలు మోసం చేస్తున్నాయి. యూరోపియన్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ వారు తాజాగా 2,758 ఆరోగ్య గప్పాల గురించి శాస్త్రీయ పరిశోధనా వివరాలను ప్రచురించారు. వాటిలో కేవలం ఐదో వంతు మాత్రమే వాస్తవాలని రుజువైంది. కఠిన నిబంధనలు, ఉన్నత ప్రమాణాలు పాటిస్తారని చెప్పుకొనే ఐరోపాలోనే పరిస్థితి ఇలా ఉంటే మన వంటి దేశాల గురించి తలచుకుంటే భయమేయటం లేదూ ! ఆరోగ్యానికి మంచివని ప్రకటించిన అన్ని ఆహార పదార్ధాలూ నిజంగా మంచివి కావని ఐరోపా సంస్థ తెలిపింది.

ప్రపంచమంతా పొగాకు ఉత్పత్తులను, పొగతాగటాన్ని నిషేధించాలని కోరుతుండగా... అది జరిగితే 'పొగాకు మాఫియా'లు కూడా తలెత్తుతాయని కొందరు ప్రచారం చేస్తున్నారు. దీని వెనుక ఫిలిప్ మోరిస్ వంటి బడా పొగాకు కంపెనీలు ఉన్నాయని వేరే చెప్పాలా? అయితే మలావీ వంటి దేశాల జిడిపిలో 70శాతం పొగాకు ఎగుమతుల ద్వారానే వస్తుందని అక్కడి రైతులు చెప్పటం 'అతిశయోక్తి'గా ఉండవచ్చుగాని కొన్ని దేశాలు గణనీయంగా పొగాకుపై ఆధారపడ్డాయి.

'అనాథ టూరిజం' 'దారిద్ర్య టూరిజం' వంటి పేర్లు ఎప్పుడైనా విన్నారా!! టూరిజం అంటే ఆహ్లాదం, వినోదం, మానసికోల్లాసం కలిగించటం కదా. కానీ కొందరు ధనికులు 'అనాథ శరణాలయాలను, మురికివాడలను' చూడటంలో కూడా ఆనందం పొందుతున్నారట. కొన్ని దేశాలలో అనాథ పిల్లలు ఎక్కడ ఉన్నారో వెతికి వారిని కొన్ని ఆశ్రమాలలో ఉంచి విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు వారిని చూపటం కూడా టూరిజంగా మారిపోయిందట. అయితే పిల్లలు అలాంటి వారి నుంచి తప్పించుకుపోతుండటంతో పట్టుకున్నవారికి కాపలా కాయటం, కొత్త వారికోసం వెతకటమే ఉపాధిగా మారిందట. 'అమానుషం' కదా !!

- సత్య

నువ్వుల స్పెషల్స్...



చికెన్ కర్రీ

కావలసిన పదార్థాలు

నువ్వులు - 4 టేబుల్ స్పూన్లు
చికెన్ - 1/2 కిలో
ఉల్లిపాయ ముక్కలు - 1 కప్పు
పచ్చిమిర్చి -4 (ముక్కలు కోసుకోవాలి)
ఉప్పు, కారం, పసుపు, నూనె - తగినంత
అల్లం,వెల్లుల్లి పేస్ట్- 1 టేబుల్‌స్పూన్
గరం మసాలా - 1టేబుల్ స్పూన్
నీళ్లు - తగినన్ని
కొత్తిమీర, పుదీనా - 1/2 కప్పు (సన్నగా తరిగినది)

తయారు చేసే విధానం

ముందుగా చికెన్‌ను శుభ్రం చేసుకొని ఉప్పు, కారం, పసుపు, అల్లంవెల్లుల్లి పేస్ట్, తరిగిన కొత్తిమీర, పుదీనా మిశ్రమం వేసి బాగా కలిపి అరగంటసేపు ఉంచాలి. నువ్వుల్ని దోరగా వేయించి మిక్సీ వేసుకోవాలి. గిన్నెలో నూనె వేసి వేడెక్కాక ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగనివ్వాలి. అందులోనే ముందుగా కలిపి పెట్టుకున్న చికెన్ మిశ్రమాన్ని వేసి నీరంతా ఇగరనివ్వాలి. తర్వాత కొద్దిగా నీరు పోసి సన్న సెగమీద మగ్గనివ్వాలి. చివరిలో గరంమసాలా, నువ్వుల పొడి వేసి కొద్దిసేపు ఉడకనివ్వాలి. అంతే చికెన్ కర్రీ రెడీ. ఇది చపాతీల్లోకి, అన్నంలోకి బాగుంటుంది. కొందరు జీడిపప్పు పేస్ట్ వేస్తారు. దానికన్నా నువ్వుల పేస్ట్ రుచిగా ఉంటుంది. ఖరీదు తక్కువ, ఆరోగ్యం.



కుకీస్

కావలసిన పదార్థాలు

నువ్వులు - 4 టేబుల్ స్పూన్లు
మైదాపిండి - 1/4 కప్పు
వెన్న -1 టేబుల్ స్పూన్
పంచదార పొడి- 1 కప్పు
ఓట్లు - 3/4 కప్పు,
బేకింగ్ సోడా - 1 టేబుల్‌స్పూన్
బాదం పొడి - 1 టేబుల్ స్పూన్ (మరీ మెత్తగా చేయకూడదు)
నీళ్లు - తగినన్ని, ఉప్పు - చిటికెడు
క్యారమెల్ - 1 స్పూన్ (పంచదార ఉట్టి గిన్నెలో వేసి కొద్దిసేపు ఉంచి దింపేస్తే చాక్లెట్ కలర్ వస్తుంది.)
నెయ్యి -1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

ముందు స్టవ్ వెలిగించి మందపాటి గిన్నె పెట్టుకుని వెన్న వేయాలి. అది కరిగాక పంచదార పొడి, చాక్లెట్ కలర్ వేసి బాగా తిప్పాలి. ఆ తర్వాత మిగిలిన పదార్థాలన్నీ వేసి కలుపుకోవాలి. అదంతా దగ్గరగా అవుతుంది. అవసరమైతే కొద్దిగా వేడినీళ్లు కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఉండల్ని అరచేతికి నెయ్యి రాసుకుని వేళ్లతో గుండ్రంగా ఒత్తుకోవాలి. అలా అన్నీ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. వీటిని మైక్రో ఓవెన్‌లో పెట్టి సుమారు 20 నిమిషాలు బేక్ చేసుకోవాలి.కేక్ ఓవెన్‌లో పెట్టి కూడా బేక్ చేసుకోవచ్చు. ఇవి కరకరలాడుతూ చాలా బాగుంటాయి. గుడ్డు ఇష్టపడేవారు అది కూడా వేసుకోవచ్చు.

లడ్డూ

కావలసిన పదార్థాలు

నువ్వులు - 1/2 కేజీ
ఎండు ఖర్జూరాలు - 1/4 కేజీ
బెల్లం - 1/2 కేజీ
యాలకుల పొడి - 1 టీ స్పూన్

తయారు చేసే విధానం

ముందు ఎండు ఖర్జూరాల్లోని గింజల్ని తీసేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. బెల్లం తురుముకోవాలి. నువ్వులు దోరగా వేయించాలి. ఆరిన తర్వాత మరీ మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. ఆఖరులో బెల్లం వేసి కొంచెం గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమంలో ఖర్జూరపొడి, యాలకులపొడి కలుపుకుని లడ్డూలు చుట్టుకోవాలి. అంతే లడ్డూలు రెడీ. ఇవి రుచిగా ఉండడమే కాదు ఆరోగ్యానికి కూడా మంచిది.



పచ్చడి

కావలసిన పదార్థాలు

నువ్వులు - 1 కప్పు, టమాటాలు - 8
పచ్చిమిరపకాయలు - 15, వెల్లుల్లి - 6 రెబ్బలు
జీలకర్ర - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత
నూనె - తగినంత, చింతపండు - తగినంత
కొత్తిమీర తురుము - కొద్దిగ

తయారు చేసే విధానం

ముందు పొయ్యి వెలిగించి బాండీ పెట్టి నువ్వులు వేయించాలి. దోరగా వేగి, కమ్మటి వాసన రాగానే తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాండీలో కొద్దిగా నూనె వేసి పచ్చిమిరపకాయలు, టమాటా ముక్కలు విడివిడిగా మగ్గనివ్వాలి. ఆఖరులో కొంచెం చింతపండు (పులుపు తినేదాన్ని బట్టి వేసుకోవచ్చు) కడిగి వేసి, స్టవ్ కట్టేయాలి. ఇది చల్లారాక ముందుగా నువ్వులు గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత పచ్చిమిర్చి, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు, చింతపండు, టమాటా ముక్కలు వేసి గ్రైండ్ చేసుకోవాలి. మరీ మెత్తగా అయితే బాగోదు. ఇది దోసెల్లోకి, అన్నంలోకి చాలా బాగుంటుంది.



- ఓ. నవ్య

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

K.V.R. B.Com.,B.L., (Director)

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-97890 99589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: [| | | | |]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

తెలుసుకుందామా...

స్నేహమంటే కలిసి తిరగడం... షికార్లు కొట్టడం... సరదాగా గడపడం కాదు. ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి మెలగడం అంతకన్నా కాదు. మనసు విప్పి మాట్లాడుకోడానికి... మనసును తేలిక పరచుకుని ఊరట పొందడానికి... తప్పలను సరిదిద్దుకుని ముందుకు సాగడానికి దారి చూపగల మోరల్ గైడెన్స్ స్నేహం. 'మేం స్నేహితులం' అని మాటవరసకు చెప్పకుంటే సరిపోదు. సరైన సమయంలో సరిగ్గా స్పందించి నడిపించగల శక్తి స్నేహంలో కనిపించాలి.

స్నేహ బంధమా...

సమస్య ఎదురైనప్పుడు దానిని విశ్లేషించడంలో, పరిష్కార మార్గాలను సూచించడంలో స్నేహితులు నిజాయితీని ప్రదర్శించాలి. కుటుంబ సభ్యులతో చెప్పుకోలేని, చర్చించలేని అంశాలకు స్నేహితులు ఆహ్వానం పలికి ఊరట కలిగించాలి. ఒత్తిడుల నుండి ఊరట చెందిన మనసు స్నేహానికి కన్నీటి అభిషేకం మౌనంగానే సమర్పిస్తుంది. స్నేహంలో 'నో థ్యాంక్స్... నో ఎక్స్‌క్యూజ్' అని పలికారంటే దానిలో ఎంతో నిగూఢమైన విలువ దాగివుందని అర్థం. స్నేహితుల మధ్య కష్టసుఖాలు ఎదురైనప్పుడు ఒకరికొకరు సహజంగా పంచుకుపోవడమే నిజమైన స్నేహం.

స్నేహితులంటే స్నేహితులే. వారిమధ్య వయసు అంతరాలను... లింగబేధాలను... అంతస్థుల కొలమానాలను.. వర్ణాల తీరులను ఎవరూ వెతుక్కోడానికి ఇష్టపడరు. చెక్కుచెదరరు. ఎందుకంటే స్నేహంలో వినిపించేది సత్యం. కనిపించేది నిజం, నిజాయితీలే. స్నేహంతో మెలగాలంటే అవగాహన, పరిపక్వత అవసరం.

మంచి జీవితానికి స్నేహం నుండి ప్రేరణ, జ్ఞానం నుండి మార్గదర్శనం లభిస్తాయి. చక్కగా వ్యవహరించడం నిజంగా ఒక పురస్కారమే. స్నేహమంటే లాభనష్టాలను బేరీజు వేసుకునే వాణిజ్య లావాదేవీలు కావు. ప్రయోజనాన్ని ఆశించకుండా మంచి చేయగలిగే శక్తి వల్ల తప్పకుండా ప్రతిఫలం లభిస్తుంది. పరులకు ఉపయోగపడని జీవితం వ్యర్థమంటారు. అలాగే సరైన సమయంలో ఉపయోగపడని స్నేహం కూడా వృథాయే. స్నేహంలో ఇచ్చిపుచ్చుకోడానికి ఇదేమీ లావాదేవీ (వస్తుమార్పిడి) కాదు.

ప్రత్యుపకారాన్ని ఆశించడం స్వార్థమే అవుతుంది. చేసిన పనికి ధన్యవాదాలు కోరుకోవడం వల్ల పని ప్రభావాన్ని కోల్పోతుంది. మంచైనా చెడైనా వడ్డీతో తిరిగి తీసుకోవడం మానవులకు అమిత ఇష్టం. కానీ ఇలాంటివేమీ స్నేహంలో కనిపించకూడదు. మంచి జరగాలని ఆలోచించడం, మంచి ప్రయత్నాలు చేయడం స్నేహానికి గీటురాళ్ల. స్నేహంలో మానసిక సమతుల్యానికి ప్రాధాన్యత వుండడం వల్ల పొగడ్తలు, నిందలు, బహుమతులు, ప్రశంసలు... ఎన్ని ఎదురైనా అన్నింటిని తగిన మోతాదులోనే తీసుకోవడం జరుగుతుంది. దీనివల్ల స్నేహాలు పదికాలాలపాటు కొనసాగుతాయి, నిలిచిపోతాయి:

జీవితంలో తోడు, నీడ, ధైర్యం, అభయం ఇలా ఎన్నో అంశాలు స్నేహం ద్వారా లభిస్తాయి. కానీ ఈ రోజుల్లో స్నేహంలో ఇన్ని అంశాలు కలబోసిన గాఢత పెద్దగా కనిపించడం లేదు. షాపింగుల కోసం, పబ్ పార్టీల కోసం, సరదా కబుర్ల కోసం తోడుగా ఉండే స్నేహాలు అధికంగా కనిపిస్తున్నాయి. 'హాయ్, హలో' అనే ముక్తసరి పలకరింపుల వల్ల ఆ స్నేహాలు కొంతకాలమే కృత్రిమంగా కొనసాగుతున్నాయి.

నిజమైన స్నేహితులు తరచూ కలుసుకోవాల్సిన పనిలేదు. అలాగని ఎల్లవేళ్లలా పక్కనే తోడుగా నిలవాల్సిన అవసరమూ లేదు. సరైన సమయంలో సరిగ్గా అందిన సింగిల్ లైన్ సమాచారంతోనైనా స్పందించగల్గితే చాలు. ఆ సమయంలో లభించే ప్రేమ, ఆనందం, భరోసా, ఊరట హిమాలయాల కన్నా ఉన్నతంగా కనిపిస్తాయి. వివాహం, ఉద్యోగం వంటి అంశాలలో సిల్వర్, గోల్డెన్ జూబ్లీలు జరుపుకున్నట్లే స్నేహానికి కూడా సెలబ్రేషన్ జరుపుకోగలిగితే అంతకన్నా అనందం ఉండదనిపిస్తుంది. అలా స్నేహంలో మునిగిన స్నేహితులు నిజంగా అదృష్టవంతులే!

స్నేహంలో గుచ్చి గుచ్చి ప్రశ్నల వర్షం కురుస్తుంటే ఏ మూలనో ఈర్ష్యాద్వేషాలు ఉన్నట్లే. ఇలాంటి స్నేహం కొనసాగించడం కన్నా వదులుకోవడం మేలు. లేకపోతే ఒకరి గురించి మరొకరు వేరొకరితో గుసగుసలాడే ప్రమాదముంది. నిజాయితీ లోపించిన స్నేహం అపోహలు - అపార్థాలు చోటు చేసుకోవడం వల్ల స్నేహితులు బద్ధ శత్రువులుగా తయారవడానికి ఆస్కారం ఉంది. స్నేహం వికటిస్తే దానికన్నా ప్రమాదం వేరొకటి వుండదు.

స్నేహంలో ఉండే సరదాల్లో నిజాయితీ కనిపించాలి. స్నేహంతో ఆటపట్టించే విధానంలో మనసు పులకరించే అంశాలు తారుమారైపోతాయి. కుటుంబ పరిస్థితుల రీత్యా వృత్తి, విద్యల రీత్యా మనుషుల మధ్య ఎడబాటు కలగడం సహజం. అంత మాత్రాన స్నేహం అక్కడితో అంతమైపోకూడదు. ఎడబాటులో మరింతగా బలపడాలి. జ్ఞాపకాల దొంతరలను

నెమరేసుకుంటూ మరింతగా పరిమళాలను వెదజల్లాలి.

స్నేహితుల దినోత్సవం జరుపుకోవడమంటే చేతికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టడంతోనో, ఒక గ్రీటింగ్‌కార్డు పంపడంతోనో, ఒక బహుమతి ఇవ్వడంతోనో ముగిసిపోకూడదు. స్నేహితులను కలిసి గత జ్ఞాపకాలను, వర్తమాన పరిస్థితులను, భవిష్యత్ ప్రణాళికలను గురించి మనసారా చర్చించుకోవాలి. ఇలా చేయడం వల్ల తప్పులు సరిదిద్దుకోవచ్చు. మంచి సూచనలు, సలహాలు పంచుకోవచ్చు. ఒక స్నేహ దినోత్సవం జీవితానికి కొత్త ఉత్సాహాన్ని సంవత్సర కాలం పాటు తరగని అనుభూతిని కల్పించేలా ఉండాలి.

నిజమైన స్నేహానికి బహుమతులేల!

ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మార్కెట్‌లోకి అనేక ఉత్పత్తులు వచ్చేస్తున్నాయి. కేవలం వీటిని కొని, ఇచ్చి పుచ్చుకోవడంలోనే స్నేహం ఉందనుకోవడం సరికాదు. నిజానికి స్నేహం విలువైన బహుమతులను ఆశించదు. పురాణాల్లో శ్రీకృష్ణుడు కుచేలుడు స్నేహానికి సంబంధించిన ఘట్టం ఒకటుందికదా. బీదవాడైన కుచేలుడు తీసుకొచ్చిన అటుకులు తిని కృష్ణుడు పరవశించిపోతాడు. స్నేహితులకు ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా ఏదో ఒక గిఫ్ట్ ఇవ్వాలనే ఫార్మాలిటీకి గుడ్‌బై చెప్పి స్నేహితుల మనసెరిగి ప్రవర్తించడం వల్ల కూడా స్నేహాన్ని మరింతగా బలపరుచుకోవచ్చు.

స్నేహం, ప్రేమలు ఎవరికీ సొంతం కాదు. ఇవి అందరి జీవితాలలోనూ ఉంటాయి. అందుకే అవి విశ్వజనీయమైనవి. విశ్వమున్నంత కాలం అవీ ఉంటాయి. వాటి మాధుర్యాన్ని ఆస్వాదించినవారు ఎవరైనా నిజమైన స్నేహితులుగా నిలిచిపోగలుగుతారు. అందుకే సృష్టిలో జీవులు సజీవాలతో, నిర్జీవాలతో కూడా స్నేహం చేయగలవు.

స్నేహబంధానికి పుట్టిన రోజు జరపాలా? అనేది కొందరి ప్రశ్న. దానికోసం ఏడాదికి ఓ రోజు కేటాయించడమేంటి? అనేది కొందరి వాదన. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం కొంత కష్టమైనా ప్రస్తుత బిజీ జీవితంలో స్నేహమాధుర్యాన్ని ఆస్వాదించడానికి, మధురజ్ఞాపకాలను నెమరు వేసుకోడానికి ఓ రోజు అవసరమేనంటారు కొందరు. ఇలా స్నేహితులు సంబరాలు జరుపుకోవడం హర్షించదగినదేనని కూడా అంటుంటారు. అది మరింత జోష్‌నిస్తుంది. ఈ ఉత్సవం కుటుంబాల మధ్య మరింతగా స్నేహభావాన్ని పెంచుతుంది. వారి తర్వాత జనరేషన్‌తో స్నేహం నడవడం వల్ల తరాలు గడిచినా స్నేహం అజరామరంగా నిలిచిపోతుంది. స్నేహంలో ప్రాణానికి ప్రాణమన్న భావన కనిపిస్తుంది. అందుకే స్నేహితులు భౌతికంగా ఇద్దరయినా ప్రాణంగా ఒక్కరేనని నమ్ముతారు. కష్టసుఖాల్లో తెలియకుండానే భాగస్వాములైపోతారు. స్నేహితుల్లో 'ది బెస్ట్' చెప్పడం పొరపాటు. ఆ నెంబరింగ్ స్నేహస్థాయిని దిగజార్చేస్తుంది. స్నేహితులు ఎంతమంది ఉన్నా వారందరికీ సమానంగా స్నేహాన్ని పంచగలిగే స్నేహితుడే 'ది బెస్ట్' కాగలడు. అందుకే ఎదుటివారిని మీకు బెస్ట్‌ఫ్రెండ్ ఎవరని ప్రశ్నించకండి. అలా ఎవరైనా అడిగితే మీరూ బయటపడకండి.

జీవితం చాలా చిన్నది. చాలా పవిత్రమైనది. జీవించే కాలం చాలా విలువైనది. అందుకే వీలైనంతగా ఆనందిస్తూనే జీవించాలి. అలాంటి ఆనందాన్ని పంచగలిగే ఆయుధమే స్నేహం. జీవితాన్ని ప్రేమిస్తూ పరులకోసం ప్రేమను పంచుతూ జీవించడం వల్ల చరిత్రలో కొన్ని పేజీలు వారికై కేటాయించబడతాయి. మనకు తెలియకుండానే మనకు స్నేహితులమంటూ ప్రకటించుకునేలా మనం ఉపయోగపడగలిగితే అంతకు మించిన సంతోషం మరొకటి ఉండదు.

స్నేహితుల దినోత్సవం సందర్భంగా మన మనసును ఓసారి ఆవిష్కరించుకుందాం! ఇప్పటి వరకు మన జీవితంలో తారసపడిన వారెందరు? వారిలో మనకు నిజమైన స్నేహితులెందరు? అని ఆలోచించుకుందాం. చెడు స్నేహాలను 'డిలీట్' చేసి కొత్త స్నేహాలకు ఆహ్వానం పలుకుదాం. 'స్నేహమే జీవితం, స్నేహానికన్నా మిన్న ఏదీ లేదని' విశ్వసించి ప్రయాణిద్దాం. స్నేహం విలువలను గుర్తెరిగి మరింత వన్నె పెరిగేలా సరికొత్తగా ఆవిష్కరించుకుందాం.

- బాసు

స్నేహం కోసం ఒక రోజు...

స్నేహం జీవితంలో ఎంతో విలువైన బంధం. ఈ బంధాన్ని అందరిలో పెంపొందించడానికి పాశ్చాత్య దేశాల్లో 'ఫ్రెండ్‌షిప్‌డే'లను ఘనంగా నిర్వహిస్తుంటారు. అసలు స్నేహితుల రోజుకు తెర తీసింది అమెరికా. 1935వ సంవత్సరంలో అమెరికా కాంగ్రెస్ సభ ప్రతి ఏటా స్నేహదినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానం చేసింది. గ్రీటింగ్ కార్డుల్లో ప్రముఖ సంస్థగా చెప్పబడే 'హాల్ మార్క్' సంస్థ వ్యవస్థాపకుడు జాయ్.సి.హాల్ స్నేహితుల కోసం స్నేహితులు దినోత్సవం నిర్వహించాలని ఎప్పుడో ప్రతిపాదన చేశాడు. అయితే అమెరికా కాంగ్రెస్ తీర్మానంతో ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారం నాడు జాతీయ స్నేహదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అప్పటి నుండి అదే సంప్రదాయంగా చాలా దేశాలు అనుసరిస్తూ ఫ్రెండ్‌షిప్ దేను ఘనంగా చేసుకోవడం మొదలుపెట్టాయి.

సాంకేతిక పరిజ్ఞానం రాజ్యమేలుతున్న నేటి తరుణంలో, వ్యాపార సంస్థల మధ్య ప్రతి నిమిషం పోటీనే. ఈ పోటీలో వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఎవరిగోల వారిదే. ముఖ్యంగా ఏ మార్కెట్లో చూసినా 'సెల్‌ఫోన్ల' గోలే. మానవుని దైనందిన జీవితంలో నిత్యావసర సాధనంగా రూపాంతరం చెందిన ఈ 'సమాచార పరికరం' మానవ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఊతమవుతోంది. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకునే పరికరంలా వెలుగులోకి వచ్చిన సెల్‌ఫోన్... క్రమేపీ విశ్వాన్నే మన గుప్పెట్లోకి తెచ్చేసింది. 2011వ సంవత్సరం మొబైల్ హ్యాండ్‌సెట్ తయారీదార్లకు పెద్ద పోటీ సంవత్సరంగా మారింది.



ఎవరి గోల వారిదే!

ప్రపంచవ్యాప్తంగా 'ఆండ్రాయిడ్' సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. ప్రస్తుతం మార్కెట్లో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో విడుదలయ్యే మొబైల్సే అధికం. అంతేకాకుండా ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ స్మార్ట్ ఫోన్లకి మార్కెట్లో పోటీ వాతావరణం కూడా నెలకొంది. ఈ నేపథ్యంలో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ మొబైల్స్‌కి పోటీదారులైన మైక్రోసాఫ్ట్, ఆపిల్ సంస్థలు తమ ఆపరేటింగ్ సిస్టమ్‌లనూ విడుదల చేస్తున్నాయి. ఆసియా, లండన్‌లలో విండోస్ ఫోన్ 7 మ్యాంగో ఆపరేటింగ్ సిస్టమ్ మొబైల్స్‌కు మంచి డిమాండ్ ఉంది. దీనిలో భాగంగానే ప్రముఖ కంపెనీలు అయిన నోకియా, శ్యామ్‌సంగ్, ఎల్‌జీ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. మొబైల్ మార్కెట్లో పెరిగిన పోటీ, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మొబైల్ కంపెనీలు, కొత్తగా వచ్చిన ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ వంటివి నోకియాను సైతం వెనక్కి నెట్టాయి. అంతేకాకుండా.. యాపిల్ ఐఫోన్ ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావడం, ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో శ్యామ్‌సంగ్ అందిస్తున్న గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లు స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 'నోకియా' సిగ్నల్స్‌కు జామర్‌లుగా మారాయి. మొత్తంమీద మొబైల్ ఫోన్లను అందిస్తోన్న ప్రముఖ సంస్థల గురించి క్లుప్తంగా ...

నోకియా మొబైల్ రంగంలో రారాజుగా వెలిగొందిన నోకియా ఏది చేసినా అందులో తన ప్రత్యేకతను చాటుకుంటుంది. అందుకే కస్టమర్స్ కోసం ప్రత్యేకంగా ఎన్‌ఎఫ్‌సి (Near Field Communication) అనే ఓ సరికొత్త టెక్నాలజీని పరిచయం చేస్తోంది. ఎన్‌ఎఫ్‌సి టెక్నాలజీ అంటే... ఎన్‌ఎఫ్‌సి టెక్నాలజీతో రూపొందించిన చిప్స్‌ని రెండు మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసి ఒకే ఒక సింగిల్ టచ్‌లో డేటాని ట్రాన్స్‌ఫర్ చేస్తారు. ఎన్‌ఎఫ్‌సి చిప్స్ ఇన్‌స్టాల్ చేసిన మొబైల్ ఒక స్మార్ట్‌ఫోన్‌తో సమానం. ముఖ్యంగా ఈ ఎన్‌ఎఫ్‌సి టెక్నాలజీని హై ఎండ్ మొబైల్స్ తయారీలో ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే ఈ ఎన్‌ఎఫ్‌సి టెక్నాలజీ గురించి నోకియా విస్తృతంగా సమాచారం అందిస్తోంది. ఇండియన్ మొబైల్ మార్కెట్లో నోకియా గట్టి పోటీ ఎదుర్కొంటున్నప్పటికీ భారతీయ వినియోగదారుల్లో ఇప్పటికీ ఇదే నెంబర్ 1 బ్రాండ్ అని ఒక సర్వేలో తేలింది. నోకియా అంతలా భారతదేశంలో క్లిక్ అవ్వడానికి కారణాలు... ఒకటి బ్యాటరీ బ్యాక్‌అప్. రెండవది మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించడం. వీటితో పాటు అన్ని రకాల వర్గాల వారికి సంబంధించి మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయడం.

శ్యామ్‌సంగ్ ప్రపంచంలో చెప్పుకోదగ్గ మొబైల్ మోడళ్లను ఉత్పత్తి చేసే మొబైల్ తయారీ సంస్థ శ్యామ్‌సంగ్. ప్రపంచం మొత్తం మీద 160 దేశాలలో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. దీనితోపాటు గ్లోబల్ మార్కెట్ మొబైల్ హ్యాండ్ సెట్‌లో 20శాతం షేర్‌ని ఆక్రమించింది. తక్కువ ధరలో ఎక్కువ కాలం వచ్చేటటువంటి తన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అందించి మొబైల్ మార్కెట్‌లో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న సంస్థ శ్యామ్‌సంగ్ కంపెనీ ఒక్క మధ్యతరగతి కుటుంబాలనే కాకుండా బేసిక్ నుండి మల్టీమీడియా, హైఎండ్ మొబైల్ ఫోన్స్‌ని మార్కెట్లోకి విడుదల చేసి తన సత్తాని చాటుతుంది. రాబోయే కాలంలో ఇండియన్ మొబైల్ మార్కెట్‌కి మంచి భవిష్యత్తు ఉండడంతో మొబైల్ కంపెనీలు చూపులు అన్ని ఇండియా మీద పడ్డాయి. అందులో భాగంగా శ్యామ్‌సంగ్ తన అమ్ములపొది నుండి మరో రెండు కొత్త చాటింగ్ సిరీస్ మొబైల్స్‌ని మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ఆ రెండు చాటింగ్ సరీస్ ఫోన్సే Samsung Ch@t 222, Ch@t 335. ముఖ్యంగా శ్యామ్‌సంగ్ గెలాక్సీ సిరీస్ మొబైల్స్ మార్కెట్లో మంచి అమ్మకాలను నమోదు చేయడంతో అదే సిరీస్‌లో మరికొన్ని లేటెస్ట్ మోడల్స్‌ని మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. అందులో భాగంగానే శ్యామ్‌సంగ్ గెలాక్సీ సిరీస్‌లో బాగా పాపులర్ అయిన శ్యామ్‌సంగ్ గెలాక్సీ ఎస్2 వైట్ మొబైల్‌ని త్వరలో మార్కెట్లోకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది.

ఆపిల్ కంపెనీ ఉత్తమమైన నాణ్యత గల ప్రొడక్ట్స్‌కు పెట్టింది పేరు. సాధారణంగా ఆపిల్ కంపెనీ తమ ప్రొడక్ట్స్‌ని విడుదల చేసిన తర్వాత ఎటువంటి డిస్కౌంట్లు, ఆఫర్లు ఇవ్వదు. ఇందుకు కారణం ఆపిల్ ప్రొడక్ట్స్‌కి ప్రపంచం మొత్తం మీద ఉన్న గిరాకి అలాంటిది. ఒక్క ఉత్పత్తిని తయారు చేసిందీ అంటే అందులో అన్ని ఫీచర్లు ఉంచడమే కాకుండా నెంబర్‌వన్‌గా ఉంటాయి. ఇటీవల కాలంలో ఆపిల్ కొన్ని సెలక్ట్ సర్వీస్ ప్రొవైడర్స్ కోసం ప్రత్యేకంగా లాక్డ్ ఐఫోన్ మోడళ్లని మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఆపిల్ విడుదల చేసిన ఈ లాక్డ్ ఐఫోన్స్ ఏఏ సర్వీస్ ప్రొవైడర్లు ఉన్నాయో వాటికి మాత్రమే పనిచేస్తుంది. వేరే ఇతర సిమ్ కార్డ్స్‌కి ఇది పనిచేయదు. భారతీ ఎయిర్‌టెల్, ఎయిర్‌సెల్ ప్రొవైడర్స్ మాత్రమే ఐఫోన్4 ఇండియాలో పని చేస్తుంది.

మోటరోలా ప్రపంచవ్యాప్తంగా వున్న మొబైల్ తయారీదారు సంస్థలలో నాణ్యమైన మొబైల్స్‌ని అందించే కంపెనీలలో మోటరోలా ఒకటి. ఇండియన్ మార్కెట్‌లో మోటరోలాది ప్రత్యేకమైన స్థానం. ఇండియన్ సిటీలలో మోటరోలా మంచి ఉత్పత్తులను కస్టమర్స్‌కు అందించడమే కాకుండా గతంలో భారతీయులకు చిన్న చిన్న హ్యాండ్ సెట్‌ల నుండి హయ్యర్ ఎండ్

సెట్లు వరకు కూడా విడుదల చేసింది. ప్రస్తుతం మొబైల్ మార్కెట్‌లో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించిన ఫోన్స్, స్మార్ట్‌ఫోన్స్ మార్కెట్‌లో హల్ చల్ చేస్తుండగా, మోటరోలా మోటో ఎమ్మి870 అనే మొబైల్‌నికూడా విడుదల చేయనుంది. మోటో ఎమ్మి870 అమెరికా, యూరప్ దేశాలకు 2011 మధ్యలో వస్తుండగా, ఇక ఆసియా దేశాలలో 2011చివరలో రానుంది. ఇప్పటికే దాదాపు 10 మోడళ్లను మార్కెట్లో ప్రవేశపెట్టిన మోటరోలా, 2015 నాటికి భారతీయ స్మార్ట్ మార్కెట్లో 30 శాతం వ్యాపారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోంది.

సోనీ ఎరిక్సన్ మొబైల్స్ విషయంలో ఎంతో జాగ్రత్త వహించి కస్టమర్లకి నాణ్యమైన సేవలు అందించే మొబైల్ సంస్థ సోనీ ఎరిక్సన్. ఇటీవల కాలంలో ఎక్స్‌పీరియా సిరీస్ స్మార్ట్ ఫోన్స్‌ని మార్కెట్‌లోకి విడుదల చేసిన సంగతి తెలిసిందే. సోనీ ఎరిక్సన్ ఎక్స్‌పీరియా సిరీస్ స్మార్ట్ ఫోన్స్ ప్రపంచ వ్యాప్తంగా సోనీ ఎరిక్సన్ అమ్మకాలను 40శాతానికి పెంచాయి. ప్రస్తుతానికి ఈ సిరీస్‌కు సంబంధించి పది మోడళ్ళు మార్కెట్‌లో హల్ చల్ చేస్తున్నాయి. రాబోయే కాలంలో వీటి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మరిన్ని మోడళ్లను మార్కెట్‌లోకి విడుదల చేయాలని సోని కంపెనీ భావిస్తోంది. మొన్నటి వరకు మార్కెట్‌లోకి సోనీ ఎరిక్సన్ తన ఆండ్రాయిడ్ వాక్‌మెన్ స్మార్ట్‌ఫోన్‌ని విడుదల చేయనున్నట్లు ఊహాగానాలు వచ్చిన విషయం తెలిసిందే. చివరకు ఈ ఊహాగానాలను పటాపంచలు చేస్తూ సోనీ ఎరిక్సన్ వెబ్‌సైట్‌లోనే దీని గురించిన సమాచారం ఉంచారు. ఇక ఈ మొట్టమొదటి ఆండ్రాయిడ్ వాక్ మెన్ స్మార్ట్‌ఫోన్‌ని చైనా, హాంగ్‌కాంగ్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, తైవాన్, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలలో విడుదల చేయనున్నట్లు అధికారకంగా ప్రకటించింది. ఇక ఆండ్రాయిడ్ వాక్‌మెన్ స్మార్ట్‌ఫోన్ విషయానికి వస్తే దీనికి సోనీఎరిక్సన్ డబ్ల్యు8గా నామకరణం చేశారు.

ఎల్‌జి ఈ పేరు తెలియని వారు ఎవరు ఉండరు.. ఎలక్ట్రానిక్ వస్తు తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరు గడించిన ఈ సంస్థ ఇటు సెల్‌ఫోన్ మార్కెట్లోనూ దూసుకుపోతోంది. టీవీలు, రిఫ్రిజిరేటర్లకు ఎల్‌జీ కంపెనీ పెట్టింది పేరు. వీటితోపాటు గ్లోబల్ మొబైల్ మార్కెట్లో ఉత్సాహంగా కొత్త మోడళ్లని విడుదల చేస్తోంది. ఇప్పటి వరకు ఎల్‌జీ కంపెనీ మార్కెట్లోకి హైఎండ్ మొబైల్స్ కానీ, బేసిక్ మోడల్స్ కానీ వందకు పైగా మోడల్స్‌ని విడుదల చేసింది. ప్రపంచం మొత్తం మీద ఎల్‌జీ కంపెనీ 130 దేశాలలో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న నోకియా, శ్యామ్‌సంగ్, మోటరోలా, హెచ్‌టిసి కంపెనీల ఉత్పత్తులకు గట్టి పోటీ ఇస్తోంది. మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్లని పరిచయం చేసిన కంపెనీ కూడా ఎల్‌జీ అనే చెప్పాలి. ముఖ్యంగా మల్టీమీడియాని దృష్టిలో పెట్టుకొని ఎల్‌జీ ఆప్టిమస్ పి690 మొబైల్ ఫోన్‌ని రూపొందించింది. ఇతర కంపెనీల మొబైల్స్‌కు గట్టి పోటీ ఇస్తోన్న ఎల్‌జీ ఆప్టిమస్ పి690 ఈ సంవత్సరం నవంబర్ చివరికల్లా ఇండియన్ మార్కెట్లోకి రావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా ఆండ్రాయిడ్ వ్యవస్థతో రూపుదిద్దుకుంటున్న 5 ఫోన్‌సెట్లను ఎల్‌జీ సంస్థ 2011 చివరి నాటికి విడుదల చేయనుంది.

మైక్రోమ్యాక్స్ ఇది ఇండియన్ మొబైల్ ఫోన్ తయారీదారు అని చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. మైక్రోమాక్స్ విడుదల చేసిన ఫోన్స్ తక్కువే అయినా నాణ్యతకు పెట్టింది పేరు. అంతేకాకుండా తక్కువ ఖరీదుతో ఎక్కువ రకాల ఫీచర్స్ వుండే మొబైల్‌ఫోన్స్ మైక్రోమాక్స్ సొంతం. ఇటీవల కాలంలో మైక్రోమాక్స్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్2.2 కలిగినటువంటి మైక్రోమాక్స్ బ్లింగ్ 2ని విడుదల చేసింది. ఇది మార్కెట్ లోకి విడుదల అయిన తర్వాత ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్స్‌లో ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇప్పుడు అదే మైక్రోమాక్స్ కంపెనీ ఆండ్రాయిడ్ 2.2 ఫ్రోయో ఆపరేటింగ్ సిస్టమ్‌తో మైక్రోమాక్స్ ఏ70 మొబైల్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. అంతేకాకుండా మైక్రోమ్యాక్స్ త్వరలో తన కంపెనీ నుండి గేమింగ్ మొబైల్స్‌ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తోంది. ఇండియాలో ఉన్న టీనేజర్స్, కాలేజి స్టూడెంట్స్ దృష్టిలో పెట్టుకొని ఈ గేమింగ్ మొబైల్స్‌ని విడుదల చేస్తున్నట్లు ఆ సంస్థ చెపుతోంది.

వివ్‌సోనిక్ టెలివిజన్ సెట్స్, కంప్యూటర్స్, కంప్యూటర్ ఉత్పత్తులు తయారు చేసే ఇంటెక్స్, వీడియోకాన్ వంటి సంస్థలు ఇప్పటికే ఇండియన్ మొబైల్ రంగంలో ప్రవేశించాయి. ఇవి ప్రవేశించడమే కాకుండా అతి తక్కువ కాలంలో మంచి అమ్మకాలను నమోదు చేయడంతో, మిగిలిన కంపెనీలు కూడా మొబైల్ రంగంలోకి ప్రవేశించడానికి మార్గం సుగమం చేసుకుంటున్నాయి. అలా మొబైల్ మార్కెట్లోకి కొత్తగా ప్రవేశిస్తున్న మరో కొత్త కంప్యూటర్ల తయారీదారు వివ్‌సోనిక్. ఈ కంపెనీ త్వరలో వివ్‌సోనిక్ వి350, వివి సోనిక్ వివ్‌ప్యాడ్ 4 పేరుతో రెండు మోడళ్లను ఇండియన్ మార్కెట్లోకి రెండు కొత్త టాబ్లెట్స్‌ని విడుదల చేయనుంది. వివ్‌సోనిక్ వి350 ఆండ్రాయిడ్ 2.2 ఆపరేటింగ్ సిస్టమ్‌తో రన్ అవుతూ కస్టమర్లకి 3డి ఇంటర్ ఫేస్ ఎక్స్ పీరియన్స్‌ని అందిస్తుంది. ఇక వివ్‌సోనిక్ వివ్‌ప్యాడ్ 4 మాత్రం 4.1 ఇంచ్ టచ్ స్క్రీన్ డిస్ ప్లే కలిగినటువంటి ఫోన్. వివ్‌ప్యాడ్ 4తో పోల్చినట్లైతే వి350 3.5 ఇంచ్ టచ్ స్క్రీన్‌ని మాత్రమే కలిగి ఉంటుంది. అంతేకాకుండా స్పైస్ ఎమ్‌ఐ 270 తర్వాత ఇండియాలో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ కలిగినటువంటి డ్యూయల్ సిమ్ ఫోన్ వి350 కావడం విశేషం.

బీటెల్ 1990లలో ఇండియాలో బీటెల్ కంపెనీ అందరికి బాగా సుపరిచితం. ఇండియాలో ల్యాండ్ లైన్ ఫోన్స్‌కు వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు. ఇది మాత్రమే కాకుండా ల్యాండ్ లైన్ సర్వీస్ ప్రొవైడర్ ఎవరైనా ఉన్నారంటే వారు తప్పనిసరిగా వీటిని ఉపయోగించడం జరిగేది. ఇండియన్ టెలికమ్ మార్కెట్లో అభివృద్ధి చెందడమే కాకుండా ఆసియాలో గొప్ప ప్రొడక్ట్ డిస్ట్రిబ్యూషన్‌ని కూడా సొంతం చేసుకుంది. అలా గ్లోబల్ బిజినెస్‌లో పార్ట్ అయింది. అంతేకాకుండా భారతీ ఎంటర్ ప్రైజెస్‌లో భాగస్వామిగా కూడా చేరింది. మొట్టమొదట ఇండియాలోని మొబైల్ హ్యాండ్ సెట్ మార్కెట్లోకి అడుగుపెట్టిన ఈ కంపెనీ ఆ తర్వాతి కాలంలో బిజినెస్ ఏరియాలో అడుగు పెట్టి వంద శాతం అభివృద్ధిని సాధించింది. ఇటీవల కాలంలో బీటెల్ కంపెనీ మొబైల్ ఫోన్స్ బీటెల్ జిడి 310, బీటెల్ జిడి 218 పేరుతో రెండు కొత్త మొబైల్ హ్యాండ్ సెట్స్‌ని మార్కెట్లోకి విడుదల చేసింది.

- కె.ఎక్స్.రాజు

నా కథలన్నీ ఆలోచనల నుండి అల్లుకున్నవే...



పొద్దుపొడిచిన కాసేపటికే భానుడి తీక్షణత భరించలేనిదిగా మారడంతో, రోడ్డు మీద నరసంచారం తక్కువగా ఉంది. కానీ, విదేశాల నుంచి వచ్చిన కూతురు, కొడుకు, మనుమలు, మనుమరాళ్ళతో కాశీనాథుని వారి ఇంట సందడిగా ఉంది. తెల్లటి పైజమా, లాల్చీతో ముందు గదిలో కూర్చొని, దేవతా స్తోత్రాలు మననం చేసుకుంటున్న 'పద్మశ్రీ' కె. విశ్వనాథ్, పక్కనే మరో కుర్చీలో ఆయన సతీమణి జయలక్ష్మి - సాక్షాత్తూ ఆది దంపతులలా ఉన్నారు. పెళ్ళి బట్టల కొనుగోళ్ళకు వెళ్ళే హడావిడిలో ఉన్న పిల్లలకు మాటామంచీ చెబుతూనే, నాతో భేటీకి ఆయన ఉపక్రమించారు. తన తొలినాళ్ళ జీవితం నుంచి 'కళాతపస్వి'గా కొనసాగుతుండడం దాకా కె. విశ్వనాథ్ 82 ఏళ్ళ ప్రస్థానాన్ని సింహావలోకనం చేసుకున్నారు. "నా మీద పెద్ద భారతమే రాస్తున్నట్లున్నారే!" అంటూనే, వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు రెండున్నర గంటలకు పైగా వివరంగా సమాధానాలిచ్చారు. 'తానా' జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనతో సుదీర్ఘంగా జరిపిన భేటీలోని ముఖ్యాంశాలు...

ప్రతిష్ఠాత్మకమైన 'తానా' జీవన సాఫల్య పురస్కారం ఈసారి మీకు ఇవ్వడం పట్ల మీ స్పందన?

చాలా సంతోషం కలిగింది. 'తానా' ప్రముఖులు మా ఇంటికి వచ్చి మరీ, ప్రత్యేకించి నన్ను 'తానా'కు ఆహ్వానించారు. 'తానా' ప్రముఖుల్లో ఒకరైన నాదెళ్ళ గంగాధర్ మా ఊరి వారే అన్న సంగతి తెలిసి, మరింత ఆనందం కలిగింది. వచ్చినవాళ్ళందరూ నా సినిమాల గురించి ఎంతో గొప్పగా చెబుతూ వచ్చారు. 'తానా' పురస్కారం ప్రకటించిన తరువాత నాకు ఎంతో మంది ఫోన్లు చేసి, అభినందించారు. ఏదో కొత్త సినిమా విడుదలై, ఘన విజయం సాధించి, అవార్డులు గెలుచుకున్న రీతిలో అంతమంది నాకు ఫోన్లు చేయడం నాకు ఆశ్చర్యం కలిగించింది. అమెరికాకు గతంలో చాలా సార్లు వెళ్ళాను. కానీ, అమెరికాలో మన తెలుగు వాళ్ళందరూ ఎంత ఉన్నత స్థానానికి చేరుకొని, ఎంతటి విజయాలు సాధించారో ప్రత్యక్షంగా చూసి, ఆనందించాలనీ, అభినందించాలనే ఈ సారి అమెరికా వెళ్ళాను. ఈ వయస్సులో నాకు అందులోనే అమితానందం!

దర్శకుడు కె. విశ్వనాథ్ గురించి ఎంతో మందికి ఎంతో కొంత తెలుసు. కాశీనాథుని విశ్వనాథ్ గురించి పెద్దగా తెలియదు. చెబుతారా?

సమాజంలో ఏ వ్యక్తికైనా, తాను చేసిన ప్రత్యేక కృషి ద్వారానే గుర్తింపు వస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ గారికి సంప్రదాయ కవిత్వం, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి భావ కవిత్వం - ఇలా! కాశీనాథుని విశ్వనాథ్‌కు కె. విశ్వనాథ్‌గా గుర్తింపు వచ్చిందంటే - తీసిన చిత్రాల ద్వారానే! కె. విశ్వనాథ్ గురించి తెలుసుకోవడానికి ఉన్నంత ఆసక్తి, కాశీనాథుని విశ్వనాథ్ గురించి తెలుసుకోవడానికి ఉంటుందని అనుకోను. అయినా, మీరు అడిగారు కాబట్టి, చెబుతాను. మా నాన్నగారి పేరు - కాశీనాథుని సుబ్రహ్మణ్యం, అమ్మ పేరు - సరస్వతమ్మ. మేము ముగ్గురం సంతానం. నేనొక్కణ్ణే మగ పిల్లవాణ్ణి, ఇంటికి పెద్దవాణ్ణి. మిగతా ఇద్దరూ ఆడపిల్లలు. నేను గుంటూరులో హిందూ కాలేజ్‌లో, ఆ తరువాత ఏ.సి. కాలేజ్‌లో చదువుకున్నా. ఉద్యోగం కోసం సినీ రంగంలోకి వచ్చాను. శబ్ద గ్రహణ శాఖ నుంచి దర్శకత్వ శాఖ దాకా ఎదిగాను. ఇప్పుడీ స్థితికి చేరుకున్నాను.

కాశీనాథుని విశ్వనాథ్ అనే మామూలు మనిషి కె. విశ్వనాథ్‌గా మారడానికి ఏదో ఒక ప్రాతిపదిక ఉండాలిగా?

నిజం చెప్పాలంటే, అందుకు ఏదో నేపథ్యం కానీ, పెద్దగా ప్రాతిపదిక కానీ ఏమీ లేవు. అప్పట్లో బి.ఎస్.సి. చదివాను. చదువు పూర్తయి, ఉద్యోగం కోసం చూస్తున్న 1948 - '49 రోజుల్లో, మద్రాసులో వాహినీ స్టూడియోస్ పెడుతున్నారు. అందులో సాంకేతిక శాఖల్లో ఉద్యోగంలో చేరితే బాగుంటుందని మా మేనమామ చెప్పారు. నిజానికి, మా నాన్నగారు కూడా 'వాహినీ' వారి సినీ పంపిణీ సంస్థలోనే బెజవాడలో పనిచేసేవారు. మా నాన్నగారిని అందరూ 'వాహినీ' సుబ్రహ్మణ్యం అనే పిలిచేవారు. మా మేనమామ, నాన్న గారు చెప్పడంతో వాహినీ స్టూడియోలో చేరాను. అంతేతప్ప, నేనేదో ప్రత్యేకంగా ప్రయత్నం చేసో, చిన్నప్పటి నుంచి సినిమాల మీద తెగ ఆసక్తి ఉండో ఈ రంగానికి రాలేదు.

సినిమా రంగంలోకి ఎలా వచ్చినా, సృజనాత్మక రంగంలో ఈ స్థాయికి ఎదిగిన పరిణామక్రమం వెనుక మిమ్మల్ని ముందుకు నెట్టిన బలీయమైన శక్తి, ప్రేరణ ఏదో ఒకటి ఉండే ఉంటుంది?

శబ్ద గ్రహణ శాఖలో ఓ మామూలు ఉద్యోగిగా ఈ రంగంలోకి ప్రవేశించినా, పెద్దలతో పనిచేయడం, ఆ అనుభవాల వల్ల కాలక్రమంలో సృజనాత్మకత మీద నాకు అభిరుచి, ఆసక్తి పెరిగి, అభినివేశం కలిగింది. ఆదుర్తి సుబ్బారావు, టి. ప్రకాశరావు, గుత్తా రామినీడు లాంటి పెద్దలు ఎంతోమందితో పనిచేశాను. 'మూగమనసులు', 'మరో ప్రపంచం', 'సుడిగుండాలు' లాంటి చిత్రాలకు స్క్రిప్టు పని చేశాను. ఆ క్రమంలో అక్కినేని నాగేశ్వరరావు గారు నా పని తీరు గమనించి, దర్శకత్వ శాఖలోకి రప్పించారు. నిజం చెప్పాలంటే, ఈ మార్పుల వెనుక బలీయమైన శక్తి ఏదీ లేదు. అందివచ్చిన అవకాశాలతో, నాకు తెలియకుండానే ఈ పరిణామం జరిగిపోయింది.

శాస్త్రీయ సంగీతం, నృత్యాల పట్ల మీ అభిరుచికి మీ ఇంటి వాతావరణం ఏ మేరకు దోహదం చేసింది?

చిన్నప్పుడు ఇంట్లో మా అమ్మ పాడే పాటలు వినేవాణ్ణి. ఇక నా ఇద్దరు చెల్లెళ్ళూ చాలా బాగా పాడతారు. వాళ్ళిద్దరూ సంగీతం నేర్చుకున్నారు. వాళ్ళ పాట వినీ వినీ సంగీతం కొంత ఆకళింపు చేసుకున్నాను. బహుశా, అలా నా

అంతరాంతరాళాల్లో సంగీతాభిరుచి అనే ఓ పొర ఏర్పడి ఉంటుంది. ఒక మనిషి కాలగతిలో ఒక రూపం తీసుకోవడానికి ఇలాంటి అనుభవాలన్నీ పని చేస్తాయి. ఇవన్నీ లోలోపల బీజప్రాయంగా ఉండి, మనిషిని రూపుదిద్దుతాయి.

సినిమాల్లోకి వస్తూ మీరు శబ్దగ్రహణ శాఖనే ఎంచుకోవడానికి ప్రత్యేక కారణం?

కొత్తగా 'వాహినీ' స్టూడియోను నెలకొల్పుతున్న రోజులవి. అప్పట్లో సినిమాల్లో సౌండ్, కెమేరా, ప్రాసెసింగ్ డిపార్ట్‌మెంట్లు మూడే సాంకేతిక విభాగాలు. బి.ఎస్.సి. చదివిన నేను వెళ్ళేసరికే కెమేరా విభాగంలోకి వేరేవాళ్ళను తీసుకున్నారు. శబ్దగ్రహణ శాఖలో ఖాళీలు ఉండడంతో మా మేనమామ అందులో చేర్పించారు, చేరాను. అంతకు మించి ప్రత్యేకమైన కారణమంటూ ఏమీ లేదు. అయితే, ఏ విభాగంలో చేరినప్పటికీ మూడేసి నెలల చొప్పున ఎడిటింగ్, ఆర్ట్ – ఇలా అన్ని విభాగాల్లో పని చేస్తూ, అన్ని అంశాల్లో అవగాహన పెంచుకోవాల్సిందిగా దర్శక – నిర్మాత బి.ఎన్. రెడ్డి మా అందరినీ ఆదేశించారు. నేనూ అలానే చేశాను. తదుపరి కాలంలో నేను దర్శకుణ్ణి కావడానికి ఆ పునాది బాగా ఉపయోగపడింది.

శబ్దగ్రహణ శాఖలో పని చేయడం మీ తదుపరి వృత్తి జీవితంలో ఎలా తోడ్పడింది?

మొదట్లో నాకు సౌండ్ అసిస్టెంట్‌గా నియామకం ఇచ్చారు. అప్పట్లో వాహినీ స్టూడియో కోసం ఆగ్నేయాసియాలోనే అత్యంత నాణ్యమైన సాంకేతిక సామగ్రిని బి.ఎన్. రెడ్డి తెప్పించారు. శబ్దగ్రహణ శాఖలో పనిచేస్తూ, చివరకు అక్కడే రికార్డిస్టుగా స్థిరపడ్డాను. జెమినీ గణేశన్ హీరోగా దర్శక – ఛాయాగ్రాహకుడైన కె. రామనాథ్ రూపొందించిన 'తాయి ఉళ్ళమ్' అనే తమిళ చిత్రానికి మొదటిసారిగా నేను స్వతంత్రంగా సౌండ్ రికార్డిస్టుగా పనిచేశాను. చిత్రీకరణలో డైలాగ్ రికార్డిస్టు మాట కూడా చెల్లుబాటయ్యేది. డైలాగ్ దొర్లించేస్తున్నారు, స్పష్టత లేదంటూ మేము చెబితే, పెద్ద పెద్ద ఆర్టిస్టులు సైతం విని సరిదిద్దుకొనేవారు. అప్పట్లో ఒక్కో షాట్‌కూ లైటింగ్‌కే ముప్పావుగంట సేపు పట్టేది. అలా షాట్‌కూ, షాట్‌కూ మధ్య చాలా విరామం వచ్చేది. సౌండ్ రికార్డిస్టులమైన మేము దర్శకుడి పక్కనే కూర్చొని, టూ – వే మిక్సర్ మీద పనిచేసేవాళ్ళం. అలా పుల్లయ్య, సుందరావు నడకర్ణి, కె.వి. రెడ్డి, పి.ఎస్. రామకృష్ణ లాంటి దర్శక మహామహులు ఎందరితోనో పనిచేశాను. కిచిడీలాగా వాళ్ళందరి పనితీరునూ తల కెక్కించుకున్నా.

స్థిరపడిన శబ్దగ్రహణం నుంచి దర్శకత్వ శాఖలోకి వెళ్ళాలన్న నిర్ణయం అంత సులభంగా తీసుకోగలిగారా?

లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ఆరు నెలలు పట్టింది. అది ఓ భయానకమైన సమయం. మానసికంగా చాలా ఇబ్బంది పడ్డాను. నెల తిరిగేకల్లా నికరంగా జీతం వచ్చే స్టూడియో పని వదిలేసి, రిస్కుతో కూడిన దర్శకత్వం వైపు వెళ్ళడం సరైనదేనా అని భయం వేసింది. ఎంతోమందిని సలహా అడిగాను. నిర్మాత చక్రపాణి గారు నాకెంతో ధైర్యం నూరిపోసి, "దర్శకత్వంలోకి వెళ్ళిపో!" అని చెప్పారు. చక్రపాణి గారి మాటతో నేను దర్శకత్వం వైపు మొగ్గాను. ఇక, రెండు చిత్రాల తరువాత మూడో చిత్రానికి దర్శకత్వ అవకాశమిస్తామంటూ ఓ అగ్రిమెంట్ ఇస్తాము లెండి' అంటూ అక్కినేని గారు, దుక్కిపాటి గారితో ఒప్పందం ఇప్పించి, నా తుది నిర్ణయానికి కారకులయ్యారు.

దర్శకుడిగా మీ కెరీర్ ఎక్కడ మలుపు తిరిగిందని భావిస్తారు?

మొదట్లో కుటుంబ కథా చిత్రాలు వరుసగా తీస్తూ వచ్చాను. 'ఓ సీత కథ', 'జీవనజ్యోతి', 'శారద', 'కాలం మారింది' లాంటి మహిళా ప్రధాన చిత్రాలూ చేశాను. కానీ, 'సిరిసిరి మువ్వ' కీలకమైన మలుపుగా పరిణమించింది. మన సంగీతం, సంప్రదాయం, కళలను కొత్త తరాలకు తెలియజెప్పాలనే ప్రయత్నంలో పడడంతో, అక్కడ నుంచి బాణీ మారిపోయింది.

'సిరిసిరి మువ్వ' చిత్రం నుంచి మారిన మీ ప్రయాణానికి బీజం?

కొన్ని యాదృచ్ఛికంగా జరుగుతాయి. నా సంగీత, నృత్య ప్రధాన చిత్రాలకూ అలాగే ఎక్కడో అనుకోకుండా బీజం పడింది. 'సిరిసిరి మువ్వ' తీయడం నాకు ఓ అపురూపమైన అనుభూతి. ఒక రోజు ఉదయాన్నే ఆలోచిస్తూ, ఏదైనా స్క్రిప్టు రాద్దామని కూర్చుంటే, ఓ ధారావాహిక నవల లాగా వరుసగా ఓ 25 – 26 సీన్లు ఏకధాటిగా వచ్చేశాయి. ఆ తరువాత దాన్ని మరింతగా తీర్చిదిద్దడంతో, 'సిరిసిరి మువ్వ' తయారైంది. ఆ చిత్ర షూటింగ్ చేసి, ఊటీ కొండ మీద నుంచి కిందకు వస్తున్నప్పుడు నృత్య దర్శకుడు పసుమర్తి కృష్ణమూర్తి గారితో పూర్తిగా శాస్త్రీయ సంగీతం కథాంశంగా సినిమా చేయాలన్న ఆలోచన చెప్పాను. అదే – 'శంకరాభరణం'. ఇక ఆ తరువాత నుంచి వరుసగా మన సంప్రదాయం, కళల నేపథ్యంలో సినిమాలు తీస్తూ వస్తున్నాను.

ప్రధానంగా ఇతరుల కథలతో కాకుండా, సొంతంగా అల్లుకున్న కథలతోనే మీరు సినిమాలు తీస్తుంటారు. కారణం?

అలా ఏమీ లేదు. డి.వి.ఎస్. రాజు గారి లాంటి నిర్మాతలు ఎవరైనా నన్ను దర్శకత్వం వహించాల్సిందిగా పిలిచినప్పుడు, 'నేను ఎలాంటి సినిమాలు తీయగలనో మీకు తెలుసు. నిర్మాతగా మీకంటూ ఓ అభిరుచి ఉంది. కాబట్టి, మీరు అందరి దగ్గరా కథలు వినండి. వాటిలో బాగున్నాయనిపించినవి వడపోసి, అప్పుడు నాకు వినిపించండి' అని చెప్పేసేవాణ్ణి. ఇక వేరే కథలేమీ దొరకనప్పుడు, దొరికినవి బాగా లేనప్పుడు, "మీ పాముల పుట్ట తీయండి. అందులో ఏమైనా ఉండేమో!" అనేవారు డి.వి.ఎస్. రాజు గారు. అప్పుడు నా మనస్సులో ఏదైనా బీజప్రాయంగా ఆలోచన ఉంటే, ఆ పాయింట్‌ను చెబుతాను. అది అందరికీ నచ్చితే, అప్పుడిక ఓ ఆరు నెలలు కూర్చొని, దాన్ని పూర్తి స్క్రిప్టుగా డెవలప్ చేస్తాం. అదీ నా పద్ధతి.

మరి, ఇతర కథకుల కథలతో, మీ దర్శకత్వంలో వచ్చిన చిత్రాల్లో మీ పాత్ర ఎంత?

నేనిప్పుడు ఏదైనా మాట్లాడితే ఎవరైనా నొచ్చుకోవచ్చు. కానీ, ఉన్న మాట చెబుతున్నా. 'శారద' చిత్రం నిజానికి ఓ కన్నడ సినిమాకు రీమేక్. కానీ, కన్నడ చిత్రానికీ, తెలుగు సినిమాకూ ఎంతో తేడా ఉంది. ఇక, 'ప్రెసిడెంట్ పేరమ్మ' మూల కథ దాసం గోపాలకృష్ణది. కానీ, దానికీ, సినిమాకూ చాలా తేడా కనిపిస్తుంది. అలాగే, 'జీవనజ్యోతి'కి మూలకథ కె. రామలక్ష్మి అని వేశాం. కానీ, మూల కథ నుంచి సినిమాకు మేము తీసుకున్నది చాలా కొద్ది. అలాగే, 'కాలం మారింది', నిర్మాత – నటుడు ఎం. బాలయ్య నిర్మించిన 'నేరము – శిక్ష', 'చెల్లెలి కాపురం' చిత్రాలు కూడా! కథల కోసం రకరకాల పుస్తకాలు చదివేయడమో, వేర్వేరు భాషా చిత్రాలు చూసేయడమో, మరొకటో ఎన్నడూ చేసింది లేదు. పూర్వ జన్మ ప్రాప్తం వల్ల నా మనసుకు తట్టిన ఆలోచనల నుంచి అల్లుకున్నవే నా చిత్ర కథలన్నీ! ఉద్దండులైన ఎంతోమంది రచయితలతో పనిచేసినప్పటికీ, నేను సృష్టించినవన్నీ నిఖార్సయిన సొంతవని ఢంకా బజాయించి మరీ చెప్పగలను. నా మీద ఎవరి ప్రభావమూ, దేని ప్రభావమూ లేదు.

జీవితంపై స్త్రీల ప్రభావం వల్లే మీ కథల్లో నాయికకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారా?

నా సినిమాల్లో హీరోయిన్‌కు చాలా ప్రాధాన్యం ఉంటుందని హీరో శోభన్‌బాబు కూడా ఎప్పుడూ చెబుతుండేవారు. నిజం చెప్పాలంటే – నాకు కుటుంబ వ్యవస్థ మీద నమ్మకం ఎక్కువ. ఇందాకే చెప్పినట్లు మనిషి జీవితాన్ని నడపడానికి కానీ, సుస్థిరంగా నిలబెట్టడానికి కానీ తల్లి, భార్య – వీళ్ళే కారణం! అందుకే, నా చిత్రాల్లో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యం ఎప్పుడూ ఉంటుంది. ఫలితంగా, చాలామంది హీరోలు నాతో పని చేయడానికి సందేహిస్తుంటారు. హీరోయిన్ పాత్రదే పైచేయి అవుతుందని భయపడుతుంటారు.

'శంకరాభరణం' దర్శకుడిగా ఓ కల్ట్ ఫిగర్‌ను చేసింది. దర్శకుడిగా కాక, వ్యక్తిగా ఆ సినిమా మీలో తెచ్చిన మార్పు?

ఆ చిత్రం వ్యక్తిగా నా బాధ్యతను పెంచింది. ఏదైనా చెడ్డ పని చేయాలనుకున్నా, ఎవరికి తెలిస్తే ఏమనుకుంటారో అన్న భయాన్ని కలిగించింది. అంతకు ముందు కూడా నేను క్రమశిక్షణతో ఉన్నా, ఆ చిత్రం తరువాత ఎవరూ వేలెత్తి చూపడానికి వీలు లేకుండా మరింత క్రమశిక్షణగా ఉండాల్సి వచ్చింది.

(మరిన్ని వివరాలు వచ్చే వారం సంచికలో...)

ఇంటర్వ్యూ: రెంటాల జూనియర్

చూద్దామా

ఆల్ప్స్ అందాలు



ఎత్తైన కొండలమీద నుండి దూకే జలపాతాలు, దారి పక్కనే ప్రవహిస్తున్న చిన్న చిన్న సెలయేళ్లు, వాటి పక్కనే పచ్చని తివాచీలాంటి పచ్చికబీళ్లు... ఇవన్నీ స్విట్జర్లాండుకు ఆస్ట్రియాకు మధ్యన విస్తరించిన ఆల్ప్స్ పర్వతాల మధ్య కనిపిస్తాయి. అటువంటి ప్రశాంత వాతావరణంలో ఎంతటి అలసటతో ఉన్నవారైనా అన్నీ మర్చిపోయి అప్పుడే విరిసిన మొగ్గలాంటి తాజాదనంతో ఆహ్లాదకరంగా మారిపోతారు.

ఈ ప్రయాణంలో ప్రత్యేక ఆకర్షణ మరొకటి ఉంది. అవే పెద్ద పెద్ద టనెల్స్ (సొరంగమార్గాలు). అడుగడుగునా ఎదురయ్యే ఈ సొరంగమార్గాలలో ప్రయాణం చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఆ సొరంగ మార్గాలలో ఒకదాని పొడవు 13. 97 కిలోమీటర్లు ఉంది. అది యూరప్‌లో ఉన్న పెద్ద టనెల్స్‌లో మూడవ స్థానంలో ఉందట. అంత పెద్ద సొరంగ మార్గాలంటే ఎలా ఉంటాయో, శుభ్రంగా ఉండవేమో అనుకుంటాం. కానీ ఇవి చాలా నీట్‌గా ఉండడమే, కాదు మూడు రంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. ప్రతి టనెల్‌లోనూ ఈ విద్యుత్ తోరణాలను అమర్చారు. వాటి మధ్య ప్రయాణిస్తుంటే అడవిలో ప్రయాణిస్తున్నామనే ఆలోచనే రాదు. అవి అంత విశాలంగా ఉన్నా కూడా వెళ్లే వాహనాలకు ఒకటి, వచ్చే వాహనాలకు ఒకటి... ఇలా వేరు వేరుగా టనెల్స్ ఉన్నాయి. వీటిలో అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, టెలిఫోన్ బూతులు కూడా ఉన్నాయి. పర్యాటకులకు అడవిలో కూడా ఇంత సురక్షితమైన సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేసిన ఆ ప్రభుత్వాలకు అభినందనలు.

స్విట్జర్లాండు అందాలని ఆగస్టు నెలలోనే చూడాలి. భూమి ఇంతందంగా ఉంటుందా అనిపిస్తుంది. ఇక్కడ మొత్తం 26 సువిశాల, అందమైన సరస్సులున్నాయి. కొండలమీద అంచెలంచెలుగా పెరిగిన చెట్ల తాలూకు లేత, ముదురాకుపచ్చ రంగులను ఆ సరస్సులలోని నీళ్లు తమలో ఇముడ్చుకుని ఆకుపచ్చరంగుతో అలరారుతుంటాయి. ఎత్తైన కొండ శిఖరాలను తాకుతున్న నీలి మబ్బులు అలా అలా... తేలియాడుతుంటే... ఆ దృశ్యాలను చూసి ఆనందంతో పరవశించనివారు ఉండరు. వాటి మధ్య నున్న ఇళ్లను చూస్తుంటే ఎవరికైనా బొమ్మరిళ్లు గుర్తురావాల్సిందే.

మెలికలు తిరిగిన కొండ మీద విజ్ వేలి అనే కేబుల్ కారు స్టేషనుంది. ఎత్తైన చెట్లమధ్య అలా అలా కేబుల్ కారులో కొండపైకి వెళ్తుంటే ఆ ఆనందాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. వర్షంలో కేబుల్ కార్లు స్లిప్పయ్యే ప్రమాదం ఉందట. అందుకే వర్షం పడుతున్నప్పుడు కేబుల్ కారు వేయరు. ఈ కార్లలో ఎక్కి పైనున్న స్టేషన్‌లో దిగిన తర్వాత ఒకసారి చుట్టూ చూశామనుకోండి. కిందున్న సరస్సులన్నీ చెల్లాచెదరుగా పడిపోయిన అద్దం ముక్కల్లా కనిపిస్తాయి. కేబుల్ కారు స్టేషన్‌కి



విజ్ వేలిలో చెక్క ఇల్లు

కేబుల్ కారు

విజ్ వేలీ కొండమీదికి రోడ్డు

అతి పొడవైన టన్నెల్

ఇరవై అడుగుల దూరంలో ఒక చెక్క ఇల్లుంది. అది ఆరడుగులతో మన కౌబాయ్ సినిమాల్లో కనిపించే ఇల్లులా ఉంది. అందులో వేడివేడి టీ, తినుబండారాలు దొరుకుతాయి. నునుపుగా లేని చెక్కలు, బెంచీలు, రంపాలు, కొమ్ముబూరలు, పశు గ్రాసం... ఇలా గ్రామీణ వాతావరణంలో యేఏ వస్తువులు ఉంటాయో అవన్నీ అక్కడ కనిపిస్తాయి. స్థానిక సంప్రదాయ దుస్తులతో స్త్రీ పురుషులు అక్కడికెళ్లిన వాళ్లని ఎంటర్‌టైన్ చేస్తుంటారు. అక్కడ ఎవరి వినోదం వాళ్లది. అటువంటి వాతావరణంలో ఎవరైనా మమేకమవ్వాల్సిందే.

ఒక కొండకీ మరొక కొండకీ మధ్య మెలికలు తిరిగి మధ్యలో కొండ కింద సరస్సు చుట్టూ తిరిగి వచ్చే రోడ్లు భలేగా ఉంటాయి. కొండ శిఖరాగ్రాన ఉన్న రోడ్డును చూస్తుంటే ఆకాశాన్ని తాకుతుందా అనిపిస్తుంది. చిరు చీకట్లు కమ్ముకుంటున్న ఆ సమయంలో ఆ దృశ్యాన్ని చూస్తుంటే మనసుకెంతో హాయిగా ఉంటుంది.

ఎత్తైన ఒక ఆల్ప్స్ పర్వత శ్రేణిమీద ఎంగెల్బర్గ్ అనే ఊరుంది. ఆ వూళ్లో అడుగుపెడతామో లేదో చర్చి గంటలు అలలు అలలుగా చెవులను తాకుతాయి. అది ప్రఖ్యాతి గాంచిన మౌంట్ టిట్లిస్. అసలు సిసలు స్విస్ అనుభవం కలిగిస్తుందా ప్రదేశం.

జలపాతాల హోరు....

అడవి మధ్యలో ఇంటర్‌లేకెన్ (రెండు సరస్సుల మధ్య ఊరు) అనే ఊరికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది లాటర్బ్రన్నెన్ వాలీ. అక్కడ ట్రమ్మెల్ బాక్ అనే గ్లేసియరు జలపాతం ఉంది. ఎక్కడో పైన కొండలమీదున్న గ్లేసియరు కరిగి నీరై అమిత వేగంతో పెద్ద శబ్దంతో కిందికి దూకడాన్ని అంత దగ్గర్నుండి చూస్తుంటే మనసంతా ఒక విధమైన అలజడికి గురౌతుంది. ఆ కొండల్లో దాన్ని చేరుకోడానికి మెట్లు కట్టారు. కొంత ఎత్తు వరకు మెట్లు ఎక్కాక అక్కడ లిఫ్ట్ ఉంది. అందులో ఎక్కి మరింత పైకి వెళ్లొచ్చు. అక్కడినుండి మళ్లీ మెట్లెక్కాలి. ఆ నల్లని కొండలో పొడవాటి గుహలో, కొండ బిలాల్లో సుళ్లు తిరుగుతూ కిందికి దూకే జలపాత ఉధృతాన్ని చూసి తీరాల్సిందే కానీ వర్ణించడానికి మాటలు రావు. ఆ ప్రాంతంలో నడిచి వెళ్తుంటే మరింత మజా వస్తుంది.

ఈ జలపాతం మూడు ఎత్తైన కొండల (ఎయిగర్ 3970మీటర్లు, మాంక్ 4099మీటర్లు, జంగ్‌ఫ్రా 4158మీటర్లు) మధ్యన ఇరుకు దారుల్లో ప్రయాణిస్తుందట. పర్వతం లోపలి నుండి దూకే జలపాతం యూరప్‌లో ఇదొక్కటేనట. దాని విస్తీర్ణం 24 కిలోమీటర్లు. మంచుతోనూ, గ్లేసియర్లతోనూ కప్పబడున్న ప్రాంతం నుండి సెకనుకు 20వేల లీటర్ల నీరు పై నుండి పడుతుందట. అంటే ఆ నీటి ఉధృతి ఎంత ఎక్కువగా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి. అంత ఎత్తులో ఉన్న దాన్ని దగ్గర్నుండి చూసేందుకు ఎలివేటర్లు, మెట్లు, ఫోకస్ లైట్లు ఏర్పాటు చేసిన ఆ దేశపు అధికార బృందానికి అభినందనలు చెప్పాల్సిందే.

టాప్ ఆఫ్ యూరప్....

స్విట్జర్లాండ్ ఆల్ప్స్ పర్వతాల్లోని ఎత్తైన శిఖరాల్లో ఒకటి యూంగ్ ఫ్రూ ప్రాంతం. ప్రపంచ సాంస్కృతిక ప్రాంతంగా యునెస్కో చేత గుర్తింపు పొందిన ప్రదేశం ఇది. దాన్నే టాప్ ఆఫ్ యూరప్ అంటారు. మంచుతో కప్పబడిన ఆ కొండ శిఖరాగ్రానికి చేరుకోడానికి రెండు బుజ్జి రైళ్లను ఏర్పాటు చేశారు. అవి పర్యావరణానికి ఎలాంటి హానీ కలిగించని కాగ్ వీల్ రైళ్లు. వీటిని పునిక్యులర్ రైళ్లంటారు. ఇవి కేబుల్ ద్వారా పనిచేస్తాయి. మొదటి రైలు 1323 మీటర్ల ఎత్తుకు తీసుకువెళు ంది. అక్కడ రైలు మారి యూంగ్ ఫ్రూకి వెళ్లాలి. యూంగ్‌ఫ్రూలో కెఫెటీరియాలు, షాపింగ్ సెంటర్లు, బాలీవుడ్ రెస్టారెంట్లు... ఇలా అక్కడంతా సందడి సందడిగా ఉంటుంది. అక్కడ్నుండి ఎటు చూసినా విపరీతమైన మంచు. బాలీవుడ్ రెస్టారెంటులో చాలా రుచికరమైన శాకాహారం దొరుకుతుంది. అక్కడి గోడలమీద ఐశ్వర్యారాయ్, షారుక్‌ఖాన్... వంటి బాలీవుడ్ స్టార్ల ఫొటోలు అతికించి ఉంటాయి.

స్ఫింక్స్ చేరుకోవాలంటే ఎలివేటరు ఎక్కాల్సిందే. అది సముద్ర మట్టానికి 3571 మీటర్ల ఎత్తులో ఉన్న శిఖరాగ్రం. అక్కడి నుండి చూస్తే కళ్లు తిరగాల్సిందే. అంత ఎత్తైన కొండమీద రీసెర్చ్ ల్యాబు, ఇ మెయిల్ టెర్మినల్... ఇంకా ఎన్నెన్నో ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. స్ఫింక్స్ టెర్మినల్ నుండి కిందికి చూస్తే స్కీ – స్నో బోర్డ్ పార్క్' కనిపిస్తుంది.

ఐస్ ప్యాలెస్‌లో నేల, గోడలు, పై కప్పు అంతా మంచే. దానిలో నడుస్తూ మధ్యమధ్యలో అమర్చిన మంచు శిల్పాలు చూడడం మరపురాని అనుభూతి. మధ్యలో ఒకచోట టాప్ ఆఫ్ యూరప్ అని రాసుంటుంది. అంటే 3454 మీటర్ల ఎత్తులో ఉన్నామని అర్థం. ఆ బిలం నుండి ఒక దారి అతి పొడవైన గ్లేసియర్‌కు వెళ్తుంది.

★

హ్హా... హ్హా...

రాలేదు

భార్య: (పోలీస్ స్టేషన్‌కు వెళుతుంది) మా ఆయన బంగాళ దుంపలు కొనుక్కురావడానికి మార్కెట్‌కు నిన్న పొద్దున వెళ్లాడండి. ఇంత వరకు రాలేదు?

పోలీసు: ఓస్ అంతేనా! మరేదైనా కూర వండుకుంటే సరి.

సుభాష్, విజయనగరం.

అట్టమీది కథ

స్వాములమని ఇంకా మాట్లాడితే సాక్షాత్ భగవత్ స్వరూపులమని తమకు తామే ముద్ర వేసుకుని పూజా పీఠాలధిష్టిస్తున్నారు. సొంత సామ్రాజ్యాలు సృష్టించుకుంటున్నారు. అమాయకుల నమ్మకాలతో ఆటలాడుకుంటున్న ఇలాంటి ఆషాడభూతుల అసలుసిసలు అవతారాలు ఒక్కొక్కటే బట్టబయలవుతున్నాయి. నిత్యానందుని అత్యానంద రహస్యాలు ఆమూలాగ్రం వెల్లడై అతగాడు అత్తగారింటిని సందర్శించవలసిన గతి పట్టింది. వచ్చాక మళ్లీ భక్తాభినేత్రి రంజితతో కలసి రసవత్తర గురు పూర్ణిమ దృశ్యంలో దర్శనమివ్వడం వేరే సంగతి. అంతకు ముందే కల్కి భగవానుని కళంకిత గాథలు వెలుగు చూశాయి. అంతు తెలియని మానసిక స్థితిలో అపసవ్య అవస్థలో అమాయకులెందరో ఆ సాలెగూడులో చిక్కిన ఉదంతాలు టీవీలలో ప్రసారమయ్యాయి. వీటన్నిటినీ మించి బాబాలకు బాబాగా దేవేంద్ర వైభవంలో మునిగితేలిన పుట్టపర్తి సాయిబాబా జబ్బుపట్టి ఆస్పత్రి పాలవడం, ఆశ్రమంలోని అపార సంపదలు తరలిపోవడంపైన భక్త జనాలే గగ్గోలు పెట్టారు గాని ఏలిన వారు వేలు కదల్చలేదు. బాబా అవసానదశ నుంచి అంత్యక్రియల వరకూ కూడా ఆ విచారం కన్నా వివాదమే ప్రధానమైపోయింది. బయటివారి సంగతి అటుంచి బాబా బంధువర్గాలు కూడా గగ్గోలు పెడుతుంటే సర్కారు వారు మాత్రం ఆఖరు వరకూ మీన మేషాలు లెక్కించి అంతా అయిపోయాక రంగంలోకి దిగామనిపించారు. అక్కడ గూడుపుఠానీ జరుగుతుందని భక్తులు కూడా వాపోక తప్పలేదు. భక్తి కొద్దీ వారు ఇదంతా బాబాకు సంబంధం లేదని అనుకోవచ్చు. అంతటి వ్యక్తి ఆంతరంగికులను అమాయకంగా ఎంచుకుంటాడా అని ఆలోచించలేకపోవచ్చు. కాని అదే అసలైన ప్రశ్న. ఏతావాతా తేలేదొక్కటే! స్వీయ సామ్రాజ్యాలను తలపించే స్వామీజీల ఆశ్రమాలు అనేక రకాల అవాంఛనీయ శక్తులకు, అవినీతిపరులకు ఆశ్రయాలుగా మారుతున్నాయి. చెదురుమదురుగా గాక అన్ని చోట్లా అందరి విషయంలో ఇదే తంతు. స్వాములకూ స్కాములకూ అవినాభావ సంబంధం ఎవరూ కాదనలేని సత్యం. ఒకప్పుడు హేతువాదులు లేదా నాస్తికులు, కాదంటే కమ్యూనిస్టులు మాత్రమే చెప్పే విషయాలు ఇప్పుడు మీడియాలో రోజూ పుంఖానుపుంఖాలుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు స్వాముల స్కాముల లీలా విలాసాలు మచ్చుకు కొన్ని...

స్కాములోరి సామ్రాజ్యాలు

- కె.ఎల్.కాంతారావు



70, 80 ఏళ్ల కిందటి వరకూ ఆది శంకరాచార్యులు స్థాపించిన పీఠాల అధిపతులూ, రామకృష్ణమఠాలు నిర్వహించే స్వాములు లాంటి కొద్దిమంది ధర్మ ప్రచారకులుండేవారు. వారు కూడా దైవభక్తినీ, ధర్మాచరణను మాత్రమే బోధించేవారు. కానీ ఈనాడు అనేక పీఠాలూ మఠాలే కాదు, అనేకమంది కలియుగ దేవుళ్లు అవతారమెత్తి ధార్మిక జీవనాన్ని శాసిస్తుండడం చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. విచిత్రమేంటంటే 12,96,000 సంవత్సరాల కాలపరిమితి గల త్రేతాయుగంలో రామావతారమొక్కటే ధరించినట్లుగా పేర్కొనబడింది. పరశురాముడు కూడా శ్రీరాముడు జన్మించిన తర్వాత తన అవతార అవసరం తీరిందంటాడని రామాయణంలో చెప్పబడింది. 8,64,000 సంవత్సరాల కాల పరిమితిగల ద్వాపరయుగంలో కృష్ణావతారమొక్కటే చెప్పబడింది. కలియుగంలో కూడా ఐదు వేల సంవత్సరాలలో ఒక్క దేవుడూ అవతరించలేదు కానీ గత 150 ఏళ్లలో అనేక దేవుళ్లు జన్మించారనీ, వాళ్ల భక్తులకు మోక్షసామ్రాజ్యాన్ని కాక, భక్తుల క్షణిక బాధలూ, తాత్కాలిక సమస్యలూ తీర్చారనీ ప్రచారం జరుగుతుండడం ఈ శతాబ్ది ప్రత్యేకతగా గుర్తింపు పొందుతోంది.

పరంపర.. తామర తంపర

వీరిలో షిర్డీసాయిబాబా వారసులుగా చెప్పుకుంటున్న పుట్టపర్తి సత్య సాయిబాబా, పెనుగొండ కాళేశ్వర్, కర్నూలు బాలసాయి బాబా మరియు దత్తాత్రేయుని అపరావతారంగా చెప్పబడుతున్న గణపతి సచ్చిదానంద స్వామి, విష్ణుమూర్తి పదవ అవతారంగా తనను తాను ప్రకటించుకున్న కల్కి భగవాన్ ఉరఫ్ విజయకుమార్, కృష్ణుని అవతారంగా చెప్పుకుంటున్న స్వామి సుందర చైతన్య, ప్రకాశం జిల్లా రామదూత స్వామి... ఇలా అనేకమంది “భగవత్ అవతారమూర్తులు” మన రాష్ట్రంలోనే అవతరించడం తీవ్రంగా ఆలోచించవలసిన విషయం. వీరందరూ అతి సామాన్య, పేద కుటుంబాల్లో జన్మించారు. కానీ ప్రస్తుతం వేల కోట్ల రూపాయల ఆస్తులతో సొంత సామ్రాజ్యాలు నిర్మించుకున్నారు. హత్యలు, మానభంగాలు, కబ్జాలు ఇలా అనేక నేరారోపణలు వీరిమీదున్నాయి. చాలావరకు నిరూపితమయ్యాయి కూడా. కొన్ని నేరాలను తమ పరపతితో విచారణ స్థాయిలోనే తొక్కేయగలిగారు. వీరు భగవంతుని అవతారమూర్తులని పిలుద్దామా? అంటే

కొన్ని దశాబ్దాల కాలంలోనే ఈ విశాల భూగ్రహంపై ఇంతమంది అవసరం ఏం వచ్చిందన్న ప్రశ్న ఉదయిస్తుంది. అదీగాక వీరందరూ జీవించి ఉన్న సమయంలోనే ధర్మ సంస్థాపన జరగకపోగా నేరాల తీవ్రత, నేరస్థుల చిట్టా రోజురోజుకీ పెరుగుతోంది. మరి వీరి అవతార ప్రయోజనమేంటి? పోనీ స్వాములు, యోగులు, సన్యాసులు అనుకుందామా అంటే డబ్బు, బంగారం, ఆస్తులున్న సన్యాసులను చూస్తేనే మహా పాపమనీ, ఆ పాపం పోగొట్టుకోడానికి కట్టుకున్న బట్టలతోనే స్నానం చేయాలనీ "యాజ్ఞవల్క్య స్మృతి" వంటి స్మృతులు ఘోషిస్తున్నాయి. కాబట్టి వీరు సన్యాసులూ కారు. వీరి "లీల"లను కొన్నింటిని పరిశీలిద్దాం.

కర్నూలు బాలసాయిబాబా ఈయన మొదట్లో రికార్డింగ్ డ్యాన్సర్. బాలసాయిగా అవతారమెత్తాక ఈయన ఆస్తి వందల కోట్లలోకి చేరింది. ఈయన నడిపే స్కూళ్లలో ఉచితంగా చదువు చెప్తారని ప్రచారం. కానీ పిల్లల నుండి 40 వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తారు. హైదరాబాద్‌లోని భూ ఆక్రమణ కోర్టు ఇతన్ని భూ కబ్జాదారునిగా నిర్ధారించింది. చెక్ పవర్ తన దగ్గరే అట్టిపెట్టుకున్న "భగవాన్" ఈయన.

కాళేశ్వర్ 400 గదులతో కూడిన అన్ని వసతులూ ఉన్న బ్రహ్మాండమైన ఆశ్రమం ఈయనది. ఈ ఆశ్రమంలోని సిబ్బంది జీతాల ఖర్చే నెలకు పది లక్షల రూపాయలుంది. ఒక భక్తురాలి పట్ల అమర్యాదగా ప్రవర్తించి చెప్పుదెబ్బలు తిన్నాడు. 2005లో పెళ్లి చేసుకున్నాడు. ఆస్తుల విలువ కొన్ని కోట్ల రూపాయలు.

సుందర చైతన్యానంద స్వామి స్వగ్రామం నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం. చిన్నతనంలో కనీసం సైకిల్ కూడా లేని పరిస్థితి నుండి ఈనాడు అనేక ఎ.సి కార్లున్న పరిస్థితికి ఎదిగిపోయాడు. కబ్జాల్లో చెయ్యి తిరిగినవాడు. దళితుల గుడిసెలను కూడా వదిలిపెట్టని కబ్జావీరుడు. ధవళేశ్వరంలో ఆ కబ్జాను అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన అఖిల పక్ష కమిటీ కార్యకర్తలను గూండాలతో కొట్టించే ప్రయత్నం చేశాడు. ఉపన్యాసాలు చేసేటప్పుడు నెమలి పింఛం పెట్టుకుని భక్తులు తనని శ్రీకృష్ణావతారుడుగా భావించాలంటాడు. భక్తులతో ఒకసారి బంగారు కిరీటం పెట్టించుకుని, బంగారు మురళిని బహుమతిగా అందుకున్నాడు. అయితే ద్వాపరయుగ కృష్ణుడికీ, సుందర చైతన్యానందుడికీ గల ప్రధానమైన తేడా ఏమిటంటే శ్రీకృష్ణుడ్ని ఎంత బంగారంతోనైనా సత్యభామ తూచలేకపోయింది. ఒకే ఒక్క తులసిదళంతో అది సాధ్యమైంది. కానీ మన అపర శ్రీకృష్ణుడు భక్తులకు ఒక్కో తులసిదళం ఇచ్చి వెయ్యి రూపాయలు వసూలు చేశాడు. ఇలా కొన్ని వేల తులసిదళాలు భక్తులకిచ్చి కొన్ని లక్షల రూపాయలు ఆర్జించాడు.

గణపతి సచ్చిదానంద ఈయన పాద దర్శనానికి వెయ్యి రూపాయలు, పాద పూజకు కనీసం 20 వేలు, గృహ ప్రవేశానికి వస్తే మినిమమ్ 50 వేలు, అమెరికాలోనైతే పాద పూజకు వేల డాలర్లు వసూలు చేశాడు. ఒక దశలో తన పాదుకలను పంపి ఫీజు వసూలు చేశాడు. ఈయన ప్రస్తుత ఆస్తి వెయ్యికోట్లు.

కల్కి భగవాన్ ఉరఫ్ విజయకుమార్ ఈయన తనను తాను విష్ణుమూర్తి పదవ అవతారమైన కల్కిగా ప్రకటించుకున్నాడు. ఈయన దర్శనానికి ఐదు వందల రూపాయలు, దీక్షకు 50 వేలు, పాదం చూస్తే వెయ్యి రూపాయలు, పాద పూజకు ఐదు వేలు, మాట్లాడేందుకు వేలకు వేలు వసూలు చేశాడు. మూలమంత్రం అంటూ ఒక మంత్రాన్ని సృష్టించి దాన్ని లాకెట్‌లో పొదిగి, ఆ లాకెట్‌ని భారతీయులకు 50 వేలు, విదేశీయులకు లక్ష రూపాయలకు అమ్మాడు. చిత్తూరు జిల్లా, వరదయ్యపాలెం మండలం, బత్తలవల్లం గ్రామంలో మూడు వందల

సర్కార్ల సహకారం!

అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నా ఆశ్రమాల అధిపతులు శిష్య పరివారంతో సహా వైభోగంలో తులతూగడానికి ప్రభుత్వాధినేతలు పాలక వర్గ ప్రముఖుల కుమ్మక్కు ప్రధాన కారణం. చిన్నాచితకా నేరాలకే అమితమైన ప్రచారం ఇచ్చే ప్రభుత్వం, పోలీసులు ఈ బాబాలు, స్వాముల సామ్రాజ్యాల జోలికి పోరు. సాయిబాబా ఆశ్రమంలో అయిదు హత్యలు జరిగినా దానిపై అధికారిక దర్యాప్తు గాని విచారణ గాని లేకపోగా రాజ్యాధినేతగా వున్న శంకర్ దయాళ్ శర్మ అది చిన్న విషయమని తేల్చేశారు! బాబా ఆరోగ్యపరిస్థితిపై అనేక ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి తటపటాయించింది. వెళ్లిన మంత్రులు ట్రస్టు నిర్వాహకులకే వంత పాడారు తప్ప తమ వంతు బాధ్యత నిర్వహించలేదు. ఇప్పుడు అనివార్యంగా కొన్ని చర్యలు తీసుకుంటున్నా జరగాల్సిన నష్టం జరిగే పోయింది. లోగడ నగ్న సన్యాసిని మంగమ్మవ్వ ఓ హత్య కేసులో జైలు పాలైంది. తమిళనాడులో ప్రేమానంద అనే స్వామి కూడా అంతే. అమెరికా వెళ్లిన స్వామి రజనీష్ (ఓషో) అక్కడి పోలీసుల దాడి తట్టుకోలేక ఇక్కడకు పరుగెత్తుకొచ్చాడు. నీళ్ల స్వాములు, నిమ్మకాయల స్వాములు, వుమ్మేసే స్వాములు... ఎందరెందరో జన విజ్ఞాన వేదిక ధాటికి చిత్తయిపోయారు. ఈ బడా స్వాములు అలా చిక్కకుండా తప్పించుకోవడానికి కారణం ప్రభుత్వ అండదండలే. పాలక వర్గ ప్రముఖులు పనులు జరిపించుకోవడానికి ఈ ఆశ్రమాలను ఉపయోగించుకుంటారు. అక్కడ చట్టాలు పని చేయకుండా అడ్డుకుంటారు. ఇప్పుడు దేశంలో నల్లడబ్బు గురించి ఇంత చర్చ జరుగుతున్నది గాని బాబా ఆశ్రమంలో గుట్టలు పడిన సంపద ఎవరిదనే దానిపై మాత్రం సమాచారం లేదు. దేశ విదేశీయులు ఇష్టానుసారం సంచరించే అలాంటి చోట సంఘ వ్యతిరేక శక్తులు తలదాచుకునే అవకాశాలను ఎవరూ తోసి పుచ్చలేరు. ఆధ్యాత్మికంగా ప్రతిష్టాత్మకమైన కంచి ఆశ్రమ స్వామి జయేంద్ర సరస్వతి అరెస్టు సందర్భంలో వినవచ్చిన కథనాలు కంపరం పుట్టించాయి. ఏదో కారణంతో జయలలిత ప్రభుత్వం నాడు అంత కఠినంగా వ్యవహరించింది గాని అది అరుదైన ఘటన. ఆమెకు స్వయంగా చాలా మూఢత్వం వుంది. అవినీతి వ్యవహారాలతో నిన్న గద్దె దిగిన యెడ్యూరప్ప ముందు స్వామీజీనే సందర్శించారు. నెల్లూరు జిల్లాలోని రామదూత ఆశ్రమానికి కూడా ఆయన తరచూ వస్తుంటారు. తులాభార చక్రవర్తిగా పేరొందిన మన మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కూడా బాబాలు స్వాముల చుట్టూ తిరుగుతుండే వారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, పోలీసులు, శాస్త్రజ్ఞులు ఆఖరుకు అత్యున్నత నేతలుగా వుండాల్సిన ప్రధాన మంత్రులు రాష్ట్రపతులు కూడా రాజ్యాంగ విలువలను కాలదన్ని బాబాల ముందు మోకరిల్లుతుంటే సామాన్య ప్రజలు వారి చుట్టూ చేరడంలో ఆశ్చర్యం ఏముంటుంది? ప్రజల చైతన్యాన్ని, మొద్దుబార్చి పోరాటాల్లోకి రాకుండా చేసేందుకు కర్మ సిద్ధాంతం లాగే బాబాలు కూడా బాగా ఉపయోగపడతారు గనకే పాలకులు వారిని నెత్తిన పెట్టుకుంటారు. ఆపైన తమ అక్రమాలకూ ఉపయోగించుకుంటారు. ప్రశ్నించేవారిని ప్రోత్సహించకపోగా అణగదొక్కుతారు. అంతర్జాతీయ శక్తులు కూడా ఆ విషయంలో వెనకబడవు. వెరసి ఇదొక విష వలయం అంటే తప్పు కాదు.

కోట్ల రూపాయలతో గోల్డెన్ టెంపుల్ నిర్మించాడు. ప్రస్తుత ఆస్తి విలువ వేల కోట్లలో ఉంది. ఈ ఆశ్రమంలో స్వామీజీ ఇచ్చే ద్రవం తాగిన ఆశ్రమవాసులు అచేతనావస్థలో అయోమయంగా మాట్లాడుతున్న దృశ్యాలు టీవీలలో ప్రసారమై ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఈయన భూములు విపరీతంగా ఆక్రమించుకోవడంతో భూ పోరాటాలు కూడా జరిగాయి.అయితే ఇప్పటికీ దీనిపై ప్రభుత్వ చర్య శూన్యం.

రామదూత స్వామి ఈయన ఆశ్రమం నెల్లూరు ప్రకాశం మధ్య ఉంది. ఈయన భూకబ్జాదారుడని స్థానిక తహసీల్దారు కలెక్టరుకు నివేదిక పంపించాడు కూడా. అయినా నాటి కర్ణాటక ముఖ్యమంత్రి ఎడ్యూరప్ప, నాటి డిజిపి అరవిందరావు ఈయనను దర్శించి పాదాభివందనాలు, సాష్టాంగ నమస్కారాలు చేయడం ఎవరికీ అంతుచిక్కని విషయం.

పుట్టపర్తి సాయిబాబా తనకు తాను భగవంతునిగా ప్రకటించుకున్న ఈ బాబా చనిపోయిన తర్వాత, ఈయన నెలకొల్పిన ట్రస్టు సభ్యులు, బాబా డబ్బునుగానీ, బంగారాన్ని గానీ ముట్టుకునేవారు కాదనీ, విరాళాలన్నీ చెక్కుల రూపంలో ఉంటాయనీ, డబ్బు స్వీకరిస్తే రసీదు ఇచ్చేవారనీ ప్రకటించారు. అయితే ఆయన చనిపోయిన తర్వాత ఆయన బెడ్‌రూంలో దాదాపు క్వింటాల్ (వంద కేజీలు) బంగారం, కోట్ల రూపాయల నగదు కనిపించింది. ట్రస్ట్ సభ్యులు రసీదులు లేని, కోట్లాది రూపాయల బంగారం, నగదు అక్కడ ఎందుకు ఉందనే ప్రశ్నకు జవాబు చెప్ప లేదు. మీడియా కూడా సత్యసాయి నివాస గృహం నుండి అక్రమంగా తరలిపోతున్న ధనాన్ని ఎవరు బయటికి పంపారనే విషయం పైనే కేంద్రీకరించింది కానీ, అసలు సాయి నివాసంలో ఎందుకుందనే విషయంపై దృష్టి సారించలేదు.

అంతేకాదు, రిజర్వ్ బ్యాంకు సూత్రాల ప్రకారం ప్రైవేటు వ్యక్తుల వద్ద బంగారం ఎక్కడ్నుండి వచ్చిందనే వివరాలు, రసీదులు లేకుండా కిలోలు, క్వింటాళ్ల లెక్కన బంగారం ఉండకూడదు. కానీ వంద కేజీల బరువున్న సుందర చైతన్యానంద బంగారంతో తులాభారం తూగినా, పుట్టపర్తి సత్యసాయిబాబా వద్ద దాదాపు క్వింటాల్ బంగారం లెక్కల్లో లేనిది ఉన్నా రిజర్వ్ బ్యాంకు కానీ, ప్రభుత్వం కానీ ఎంక్వయిరీ చేయించిన దాఖలాలు లేవు. అంటే ఈ స్వాములూ, బాబాల ఆశ్రమాలు వారి స్వంత సామ్రాజ్యాలా? వారి నెవరూ సోదా చేయకూడదా?

ఈ భగవాన్లు, స్వాములలో కొందరు తమ భారీ నిల్వ ధనంలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాల కోసం వెచ్చిస్తున్నారు. కాబట్టి వారిని గౌరవించాలనీ, కీర్తించాలనీ కొందరు అంటుంటారు. ఇదే పరిస్థితి బాబాలు మన అమాయక భక్తుల విషయంలోనూ జరుగుతోంది. కబ్జాదారులు, మోసగాళ్లు.... బాబాలు, స్వాముల అవతారాలు ఎందుకు ఎత్తుతున్నారు?

కోవూరు నుంచి జెవివి వరకూ

70 లలో అబ్రహాం టి.కోవూరు అనే శ్రీలంక హేతువాద డాక్టరు సత్యసాయిబాబాను తన ముందు మహిమలు నిరూపించవలసిందిగా సవాలు చేశాడు. కాని బాబా స్పందించలేదు. ప్రభుత్వాలూ ప్రశ్నించలేదు. క్రమేణా టీవీ మీడియా వచ్చిన తర్వాత బాబా మహిమలు మానేసి దాన ధర్మాలు మొదలెట్టారు. అది కూడా ప్రజా ధనమే మరి. ఇటీవల చాలా కాలంగా జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు మహిమల బండారం బయటపెడుతున్నారు. బాబాలు, స్వాములు చేసేవన్నీ మరింత బాగా చేసి చూపిస్తూ ఇదంతా హస్త లాఘవమేనని నిరూపిస్తున్నారు. దురదృష్టం ఏమంటే వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు.

అన్న ప్రశ్నకు ఒక టీవీ చానల్ ప్రసారంలో ఒకరు ఇచ్చిన సమాధానం మీ ముందుంచుతాను.

"ఒక కొలనులో కొన్ని చేపలుండేవి. వాటిని తినడానికి ఓ కొంగ వచ్చింది. రోజల్లా ఆ నీళ్లల్లో ప్రయత్నించినా ఒక్క చేపా దానికి దొరకలేదు. అప్పుడది సమీపంలో వున్న తన గురువుగారి దగ్గరకు వెళ్లి తనకు చేపలు దొరికే మార్గం చెప్పమని అడిగింది. ఆ గురువుగారు నీవు రేపు కాషాయ వస్త్రాలు ధరించి వెళ్లు. నీ దగ్గరకే చేపలు వస్తాయి" అని చెప్పారు. గురువు గారు చెప్పినట్టే చేసి కొంగ కడుపు నిండా చేపలను ఆరగించిందట. ఇదీ కాషాయ వస్త్రాల రహస్యం. అందుకే నిపుణులైన మోసగాళ్లు కాషాయ వస్త్రాలు ధరించి ప్రజల ముందుకు వస్తున్నారు. అమాయకులైన ప్రజలు వారి వలలో పడి తమ సర్వస్వం సమర్పించుకుంటున్నారు.

ఈ సందర్భంలో ఒక విషయం స్పష్టం చేయాలి. కాషాయం ధరించిన వాళ్లంతా మోసకారులు కాదు. ఎవరైతే సామాన్యమైన మెజీషియన్లు చేసే మేజిక్కులను తాము కూడా చేసి అవి తమ మహిమలని ప్రకటించుకుంటారో, ఎవరైతే దర్శనానికి కూడా రేట్లు నిర్ణయిస్తారో, ఎవరైతే వందల..వేల కోట్లలో ఆస్తులు సంపాదించి సన్యాస ధర్మాన్ని అతిక్రమిస్తారో, ఎవరైతే తమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి తాము చనిపోయే వరకు చెక్ పవర్ కూడా వదులుకోరో వారిని మోసగాళ్లగా ప్రజలు గుర్తించాలి.

చిన్న చిన్న స్వాముల నుంచి వేలకోట్ల రూపాయలార్జించిన బడాస్వాముల వరకూ, వీరికి భక్తులెందుకు ఏర్పడుతున్నారు? కొంత మందికి



మూఢత్వమే మార్కెట్!

ఆధునిక యుగంలో కూడా ఎందుకీ మూఢత్వం? చదువుకున్న వారు కూడా మోసకారి స్వాముల వెంట ఎందుకు పడుతున్నారు? వంటి ప్రశ్నలు తరచూ ఎదురవుతుంటాయి. విద్యలో విజ్ఞానాన్ని రంగరించే బదులు దేనికదిగా చెబుతూ మూఢత్వాన్ని ప్రోత్సహించే విధానాలు ఇందుకు ముఖ్య కారణం. అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ ప్రయోగించే ఉపగ్రహ నమూనాను దైవ దర్శనానికి తీసుకువెళ్లడం నిజానికి సైన్సుకే గాక రాజ్యాంగ లౌకిక స్వభావానికి కూడా విరుద్ధం. అయినా అవన్నీ షరా మామూలుగా జరిగిపోతున్నాయి. పాలకులకు ప్రజల మూఢత్వం కావాలి తప్ప చైతన్యం కాదు.దాన్ని పెంచేందుకే సహకరిస్తారు తప్ప తగ్గించేందుకు సిద్ధపడరు. ఇప్పుడు నడుస్తున్న ప్రపంచీకరణ వాస్తవంలో మార్కెట్‌తత్వంతో పాటు మత ఛాందసాన్ని కూడా ఎగదోస్తుంది. అంతర్జాతీయ సామ్రాజ్యవాదాన్ని గురించి తెలుసుకోకుండా స్థానికత పేరిట అంధ విశ్వాసాలలో జనం కూరుకుపోవడం వారికి చాలా అవసరం. అలాగే వారి మార్కెట్ సూత్రాలకు ఏదీ అతీతం కాదు గనక మూఢత్వాన్ని భక్తి విశ్వాసాలను కూడా మార్కెట్ సరుకుగా మార్చుకుని సొమ్ము చేసుకుంటారు. బాబాలు తమ ప్రచారం తామే చేసుకునే రోజుల నుంచి ఇప్పుడు మెగా ఈవెంట్స్‌గా జరిపే స్థితికి వచ్చారంటే అదే కారణం. ఒకప్పుడు హరేరామ హరే కృష్ణ ఉద్యమం మన దేశంలో గాక పాశ్చాత్య దేశాల నుంచి దిగుమతి అయిన సంగతి మర్చిపోరాదు. వినోదం పొందడానికి విలాసంగా గడపడానికి కూడా వారికి ఈ ఆశ్రమాలు ఉపయోగపడతాయి. విదేశీయులు వస్తే అది అదనపు ఆకర్షణగా భావించి మన దేశంలోని అమాయక ప్రజలు కూడా ఎగబడతారు.

మానవాతీత శక్తులుంటాయనే కథలను పసితనం నుంచి అమ్మలు, బామ్మలు, పాఠ్యపుస్తకాలు నూరిపోయడమే స్వాములను మానవాతీత వ్యక్తులుగా నమ్మడానికి ప్రధాన కారణం. పాఠ్యపుస్తకాలలో శాస్త్రీయ అవగాహనను పెంచే అంశాలే వుండడం లేదు. పైగా ఉన్నత విద్యావ్యవస్థలో జ్యోతిషం, వాస్తు వంటి అశాస్త్రీయ అంశాలు కోర్సులుగా ప్రవేశ పెట్టబడ్డాయి. దానితో ప్రజలలో అశాస్త్రీయ ఆలోచనా విధానం బాగా ముదిరిపోయింది. "ఈశాన్య మూలన బరువు వుంటే ధన నాశం" అని ఒక వాస్తువాది అంటే నమ్మడమే గానీ ఈశాన్య మూలన వుండే కర్రకు, మన ఇంట్లో ధనాన్ని నాశనం చేసే శక్తి ఎలా వస్తుంది? అని హేతుబద్ధంగా ఆలోచించే శక్తి నశించింది. అందుకే నిన్నటి దాకా బిందెల చిల్లులకు మాట్లు వేసుకుని బతికిన వ్యక్తి నేడు నీళ్ల స్వామి అవతారమెత్తి, ప్రజల రోగాలు పోగొట్టే శక్తిగలవాడంటే నమ్మి విద్యాధికులతో సహా నీళ్ల చెంబులతో అతని ముందు క్యూ కట్టారు. నిన్న సినిమా హాళ్ల ముందు బ్లాకులో టికెట్లు అమ్మిన వ్యక్తి నేడు బాబా అవతారమెత్తి ఆశీర్వదిస్తున్నాడంటే శిరస్సు వంచారు. కాబట్టి ఈనాడు నలుగురైదుగురు బాబాలు, స్వాముల బండారం బయటపెడితే, వారి సొంత సామ్రాజ్యాల పెరుగుదల ఆగిపోతుంది. అంతే. రేపు మరో నలుగురైదుగురు స్వాములు 'అవతరిస్తారు'. ప్రజలు వారిని అనుసరిస్తారు. వీరి 'ప్రమాదం' నుంచి ప్రజలు బయటపడాలంటే విద్యార్థి దశ నుంచే పిల్లల మనస్సులలో శాస్త్రీయ అవగాహనా బీజాలు నాటాలి. ప్రకృతి సూత్రాలకతీతంగా ఎవ్వరూ ఏ పనీ చేయలేరని వివరించాలి. అశాస్త్రీయ అంశాల బోధనను నిలిపివేయాలి.

ఒక మోసకారి బాబాదో, కబ్జాస్వామిదో బండారాన్ని సైన్సు ఉద్యమకారులు బయటపెట్టినప్పుడు, ఆ ప్రయత్నం హిందూ మతం మీద దాడిగా భావించుకొని కొందరు ఆవేశపూరితులౌతున్నారు. సైన్సుఉద్యమకారులు హిందూ మతం మీదే దాడిచేస్తారనీ, ఇతర మతాలకు చెందిన మోసగాళ్ల జోలికి పోరనీ ఆరోపిస్తున్నారు. హైదరాబాదులో ఎంతోమంది ముస్లిం మతానికి చెందిన నకిలీ బాబాలు దొరికిపోయారు. సైన్సుఉద్యమకారులు బలంగా వున్న చోట ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని మోసగాళ్ల బండారాలను కూడా బయటపెడుతున్నారు. కింది ఉదాహరణను పరిశీలించండి.

"అమెరికాలో దైవదూతగా ప్రచారం పొందిన మావియన్ సెలోలార్ బొంబాయి, మద్రాసులలో విజయవంతంగా పర్యటనలను ముగించుకొని కలకత్తాలో అడుగుపెట్టారు. ఆయన రాకకు పత్రికలలో కనీవినీ ఎరుగని ప్రచారం లభించింది. చెవుడు, మూగతనంతో బాధపడుతున్నవారిని తక్షణం నయం చేస్తాననే వాగ్దానంతో నగరంలోని పార్క్ సర్కస్ మైదానంలో ఆయన బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆయన తన అసమాన వాక్చాతుర్యంతో వేలాదిమందిని ఆకట్టుకున్నారు. అయితే సైన్సుఉద్యమకారులు రంగప్రవేశం చేసి ఆయన బూటకాన్ని బట్టబయలుచేసే వరకే అదంతా సాగింది. సైన్సుఉద్యమకారులు అకస్మాత్తుగా వేదికపైకి ఎక్కి సెలోలార్ అప్పుడే నయం చేశానని చెబుతున్న ఒక వ్యక్తిని చుట్టుముట్టారు. తరచి తరచి ప్రశ్నించిన మీదట అతను అసలు చెవుడు లేదా మూగ కాదని తేలింది. దాంతో ఆగ్రహావేశులైన ప్రజలు సెలోలార్‌పై రాళ్లు రువ్వడంతో ఆయన వాటి నుంచి ఎలాగో తప్పించుకున్నారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి అక్కడి నుంచి పంపివేసింది."

(లేఖా రతనాని, కవితా షెట్టి, టి.ఎన్.గోప కుమార్, సరితా రాయ్‌లు ఇండియా టుడే లో వ్రాసిన వ్యాసం నుంచి)

ఆర్‌ఎస్ఎస్, బిజెపి, శివసేనలు బలంగా వున్న బొంబాయిలో సెలోలార్ బండారం బయటపడలేదు. అసలు అక్కడ ఆ ప్రయత్నమే జరగలేదు. సైన్సుఉద్యమకారులు బలంగా వున్న కలకత్తాలో అతని బండారం బయటపెట్టబడింది. మార్క్సిస్టు ప్రభుత్వం ఆ మోసగాడిని రాష్ట్రం నుంచి బయటకు పంపేసింది. ఇదీ అసలు విషయం.

భగవత్ స్వరూపులను విమర్శిస్తే వారి భక్తుల మనోభావాలు గాయపడతాయని ఇటీవల కొందరు అంటున్నారు. పురాణాల ప్రకారం చూసినా భగవంతుడికే భక్తులుంటారు. భగవత్ స్వరూపులను అనుసరించేవారిలో చాలా మంది అమాయకంగా మోసగాళ్లను నమ్ముతున్నారు. కాబట్టి ఆ అమాయకులను ఆత్మహత్యా సదృశ్యమైన మార్గం నుంచి తప్పించి, మోసగాళ్ల బారి నుంచి బయట పడవేయడం ప్రతి ఒక్క పౌరుని కర్తవ్యం. కాబట్టి భగవత్ స్వరూపుల మోసాలను, కబ్జాలను బయట పెట్టడాన్ని, వారి భక్తుల మనోభావాలను గాయపరచడం కానే కాదు. రాజ్యాంగంలో 51ఎ (హెచ్) అధికరణం కూడా ఆ కర్తవ్యాన్ని నిర్దేశిస్తోంది. ఇన్ని భాగోతాలు బయటపడిన తర్వాతనైనా ఈ స్వాములు, బాబాలు, భగవత్ స్వరూపుల మాయా సామ్రాజ్యాలను విచ్ఛిన్నం చేయడం ప్రతి ఒక్క దేశ భక్తుడి బాధ్యత. అంతకు మించి ప్రభుత్వాల బాధ్యత. ★

కథ

గద్ద - కోడిపిల్ల

- యెన్నం ఉపేందర్

ఎన్నోసార్లు అదే దృశ్యం కళ్ల ముందట - ఎక్కడో ఆకాశ మార్గాన విమానంలా సంచరించే గద్ద నేలవైపు దూసుకొచ్చి, తల్లికోడిచాటున గింజలు తింటున్న కోడి పిల్లని కాళ్లతో అందుకుని ఆకాశ మార్గం పట్టడం. తల్లి కోడి ఈ హఠాత్పరిణామానికి తేరుకుని గద్దెంట పరుగెత్తాలని ప్రయత్నించి విఫలం కావడం, మరలా మిగతా కోడిపిల్లలు ఏమయ్యాయోనని వెనుతిరిగి రావడం.

దీని అర్థమేంటని ఆలోచించిన కొద్దీ ఎన్నో అర్థాలు స్ఫురించేవి. ఒక వ్యక్తి ఎదగాలంటే పరిస్థితులు సహకరించాలి. విపత్కర పరిస్థుతుల్ని ఎదుర్కోవాలంటే మొక్కవోని ఆత్మవిశ్వాసం అవసరం. పర్వత సానువుల్లో రాళ్ల మధ్య నుండి చీల్చుకుని ఎదిగిన చెట్టు నాకు ఆదర్శం. ఈ రోజు ఏవేవో ఆలోచనలు. బాల్యం కళ్లముందు కనిపించసాగింది.

ప్రతిరోజూ రాను పోను పదహారు కిలోమీటర్లు నడిచి ఎనిమిది, తొమ్మిది తరగతులు పూర్తిచేశాను. ఉదయం ఎనిమిదింటికల్లా సద్దులు కట్టుకుని మేం నలుగురు స్నేహితులం దూరాన ఉన్న ఊరికి చదువుకునేందుకు వెళ్లేవాళ్లం. పొలం గట్లు, గూడెం చెరువు కట్ట, చెల్క భూములు దాటుకుంటూ మా ప్రయాణం సాగేది. ఇక సాయంత్రం అయిదు కాగానే పశ్చిమాన సూర్యుడిని చూస్తూ ఇంటికి వచ్చేసరికి చీకటి కమ్ముకునేది.

'పదవ తరగతికి కామన్ బోర్డు పరీక్షలుంటాయి. మీవాణ్ని హాస్టల్లో చేర్పిస్తే బాగుంటుందని' పంతులుగారు మా నాన్నకు చెప్పారట. నాక్కూడా చేరాలనే ఉండేది. ఇంట్లో జరుగుబాటు కష్టంగా ఉంది. 'హాస్టల్లో చేరితే ఇంత అన్నం దొరుకుతుంది. రాను పోను పదహారు కిలోమీటర్ల నడక తప్పుతుంది' అనుకున్నాను. అనుకున్నదే తడవుగా మేం నలుగురం హాస్టల్లో చేరిపోయాం.

'హాస్టల్లో తిని రాత్రికి చదువుకునేందుకు ఇంటికి రండి' అన్నారు పంతులుగారు"

'అబ్బ ! సారెంత మంచివారు. అర్థం కాని పాఠాలేమైనా ఉంటే విడమర్చి చెప్తారని' మేమనుకున్నాం.

'ఇక్కడ పడుకోండి' అంటూ ఇంటి ముందు వసారా చూపించింది మాస్టారు గారి భార్య.

'ఇక్కడా!' గోవిందు నా చెవిలో గుసగుసలాడాడు.

'ఇక్కడ కోళ్లను కమ్ముతున్నారు. వాటి పేను మన శరీరమంతా పాకుద్ది' అన్నాడు ఆ తర్వాత. వాళ్లింట్లో కోళ్లు చాలా ఉన్నాయి. అందుకే వాడి మాటల్ని అంత సులభంగా కొట్టి పడేయలేకపోయాం.

ఎలా? ఇది మొదటిరోజు! సరే చూద్దాం. సారు మనకు పాఠాలు చెబుతానన్నారు కదా' ఎలాగోలా సర్దుకుందామనుకున్నాం. ఆ రాత్రంతా కోళ్ల పేను పాకటం మూలాన నిద్ర పోలేకపోయాం. మధ్యలో లేచి ఎండు పుల్లలు పోగేసి మంట కాగాం.

తెల్లవారుతుందనగానే పంతులుగారు, 'అరె! ఇంకా పడుకున్నారా. లేవండి' అంటూ కట్టెతో తట్టారు.

'సారు ఇంత పొద్దున్నే లేపుతున్నారంటే లైటు కింద చదువుకోటానికేమో' ఆశపడ్డాడు మల్లన్న.

'లేచి గోళంలో, బాయిలర్లో నీళ్లు తోడి పోయండి' మాస్టారు భార్య ఆర్డరు వేసింది.

'ఒంట్లో బాగోలేదేమో. అందుకే నీళ్లు తోడమంటుంది' సర్ది చెప్పాడు రఘుపతి.

బావి ఆరు కండాల లోతుంది. దానికి తోడు చెక్క గిలక. నీళ్లు తోడీ తోడీ చేతులు బొబ్బలెక్కాయి. స్కూలుకి టైమౌతోందన్న తొందరలో పని పూర్తి చేసి స్కూలుకి తయారయ్యాం. అది మొదలు, ఈ తతంగం క్రమం తప్పకుండా రోజూ జరిగేది. ఇకనైనా సారు పాఠం చెబుతారని ఎదురు చూసిన మాకు ఓ సత్యం ఆ వారంలోనే అర్థమైంది. మేం కేవలం ఆ ఇంట పనివారమే.

'ఇలాగైతే మనం హాస్టల్లోనే పడుకుందాం' తీర్మానించుకున్నాం.

రెండు రోజులు సారింటికి వెళ్లలేదు. మూడోరోజు ఇంటి దగ్గర నుండి ఎవరితోనో మా తల్లిదండ్రులు హెచ్చరికలాంటి వార్త పంపారు. 'సారు పాఠం చెబుతానంటే వాళ్లింట్లో ఉండకుండా హాస్టల్లోనే ఉంటున్నామని పంతులుగారు మా తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారట.

'అయ్యో! పిల్లల భవిష్యత్తు బంగారం చేద్దామని పంతులుగారు తాపత్రయ పడుతుంటే హాస్టలు కూడు తినమరిగి ఎగ్గొడ్తున్నారా! సారింట్లో పడుకుని పాఠాలు నేర్చుకోండి. ఏమైనా తేడాలొచ్చాయా? వీపులు విమానం మోత మోగుతాయి' ఇది వారు పంపించిన వార్త సారాంశం.

ఇక మాకు తప్పలేదు. నీళ్లు తోడడంతో పాటు, పాత్రలు కడగటాలు, అప్పుడప్పుడు ఇల్లు తుడవడాలు చేయిస్తున్నారు. ఇవన్నీ చూస్తూ ఏ రోజూ 'అయ్యో!' అనలేదు సారు పుత్రరత్నం. అతను కూడా మాతోనే చదువుతున్నాడు.

హాస్టలు భోజనం రాను రాను ఘోరంగా తయారైంది. పురుగులన్నం, ఈగల చారు తినలేకపోయేవాళ్లం.

'ఈ రోజు పంతులమ్మ పప్పుచారు చేసిందిరా. తాలింపు పెడుతుంటే ఎంత కమ్మని వాసనొచ్చిందో' ఒంటికి పాకిన కోడి పేను రుద్దుకుంటూ ఆశగా అన్నాడు మల్లన్న.

'ఏంబోయింది. కొద్దిగ పప్పుచారు గిన్నెలో పోసియ్యొచ్చు కదా!' రఘుపతి జత కలిపాడు.

నేను కూడా పంతులమ్మ చేసే కూరల్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాను. మిత్రులు బయటికన్నారు. నేను లోపల మధనపడుతున్నాను. అంతే తేడా. చూస్తుండగానే పదవ తరగతి పరీక్షలు దగ్గరికొచ్చాయి. మిత్రులందరు నేనే క్లాసు ఫస్టు వస్తానని ఏక కంఠంతో అన్నారు. పరీక్ష సెంటర్ ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊళ్లో పడింది.

'అయ్యా! కడుపు కాల్తున్నా చదువును నిర్లక్ష్యం చేయకు. చదువే నీకు శ్రీరామ రక్ష' అన్న అమ్మ మాటల్ని రోజుకొక్కసారన్నా గుర్తు చేసుకునేవాణ్ణి.

మిత్రులం నలుగురం బియ్యం మూటగట్టుకుని ఆ ఊరు చేరాం. గోవిందు దూరపు బంధువుల గుడిసెలో ఓ మూల వంట చేసుకునేందుకు అనుమతిచ్చాడు. ఊరు చుట్టూ వెతికి ఎండు పుల్లలు సేకరించి ఓ మూలన వేశాం. రోజుకొకరు అన్నం వండే కార్యక్రమం పెట్టుకున్నాం. రెండు పూటలా పచ్చడి భోజనమే. రాత్రిపూట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు బయట హోల్డరుకి బల్బు తగిలించి చదువుకునేవాళ్లం. చదివినంత సేపు చదివి, ఆరు బయట పోసిన ఇసుకలో పడుకునేవాళ్లం.

ఎన్నో ఆలోచనలు. పసితనం గాయపడింది.

'మా చదువులు ఇలా అయిపోయాయేంటి? ప్రభుత్వ పాఠశాల చదువులన్నీ ఇలాగేనా? అమ్మ తప్ప చదువుకొమ్మనేవాళ్లే లేరు. అందరూ, చదివి ఏం సాధిస్తావ్? హాయిగా ఏ మెకానిక్ పనో నేర్చుకుంటే నాలుగు డబ్బులు కనపడతాయి అనే వారే. చదువు జీవితంలో పనికిరానిదా? బస్సులపై పేర్లు చదవడానికో అప్పు పత్రాలు రాయడానికో మాత్రమే చదువొస్తే సరిపోతుందని అంటుంటారు. మా ఊళ్లో ఒకరిద్దరు తప్పితే మిగతా వాళ్లందరూ ఏడో, పదో చదివి ఆపేసినవారే. నేనూ అంతేనా?' రాత్రంతా ఏవేవో కలలు, ఆక్రందనలు. పదే పదే గద్ద కోడిపిల్లని తన్నుకుపోతున్న దృశ్యం కనిపించసాగింది.

పరీక్షలు అయినన్ని రోజులు సారు కొడుకుని వేరే గదిలో వేశారు.

'ఆ గదిలో సార్ల బిడ్డలు, కొడుకుల్ని వేశారట. చీటీలు పుల్లట' రహస్య కబురు తెచ్చాడు రఘుపతి.

'నిన్న మన సారు ఇక్కడే కనిపించారు. కొడుకు కోసం వచ్చారన్నమాట' మల్లన్న మరో సాక్ష్యం వినిపించాడు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కాంపౌండు బల్బు పుణ్యమాని పరీక్షలు అయిపోవచ్చాయి. ఓ రోజు అకస్మాత్తుగా లెక్కల పరీక్ష రద్దు చేసినట్లు పేపర్లో వచ్చింది. ఎక్కడో

పెద్ద స్థాయిలో కాపీ కొట్టారట. అదికాక పరీక్షకు ముందే పేపరు లీకైందట.

'రద్దైన పేపరు బాగా రాశాంరా. మళ్లా పెట్టబోయే పరీక్ష పేపరు ఎలా వస్తుందో ఏమో!' మల్లన్న బాధ పడ్డాడు. అతను అనుకున్నట్లుగానే లెక్కల పేపరు చాలా కష్టంగా ఇచ్చారు.

మల్లన్న, రఘుపతి ముఖం వేలాడేసుకుని, 'ఇక మేం ఫెయిల్ అయినట్లేరా' బావురుమన్నారు.

'ఇవ్వాళ సారొచ్చారంట. పేపర్లు ఎక్కడకు పోయేది తెలుసుకుని దిద్దే దగ్గర డబ్బులిచ్చి మార్కులు ఎక్కువేయిస్తారంట కొడుక్కి' గోవిందు ఆవేశపడుతూ వార్త మోసుకొచ్చాడు.

చూస్తుండగానే ఓ గద్ద కోడిపిల్లను తన్నుకుపోయింది. తల్లి కోడి గద్దెంట పరుగెత్తే ప్రయత్నం చేసి చతికిలపడింది.

పరీక్షా ఫలితాలు వచ్చాయి. సారు కొడుకు క్లాసు ఫస్టు వచ్చాడు. నేను రెండో స్థానంలో ఉండిపోయాను. రఘుపతి ఎలాగోలా పాసయ్యాడు. గోవిందు, మల్లన్న పరీక్ష తప్పారు.

బండరాళ్లను చీల్చుకొని ఎదిగిన చెట్టులా ఒక్కోమెట్టూ ఎక్కాను. జీవితం ప్రతి దశలోనూ ఘర్షణ. సమాజంలో ఎన్నో గద్ద రూపాలు. స్కూలు నుండి పిల్లలు, కాలేజీ నుండి అమ్మాయిలు క్షేమంగా వస్తారో లేదోనన్న భయం. ఆరుగాలం కష్టపడ్డా, పంట చేతికి వస్తుందో రాదోనన్న భయం. ఇంటర్వ్యూ బాగా చేసినా, ఉద్యోగం వస్తుందో లేదోనన్న భయం. ఇంట్లో ఉంటే భయం, బయటికెళ్తే భయం. ఎన్నో భయాలు... ఎక్కడ చూసినా గద్దలే! అవకాశాల్ని ఇట్టే తన్నుకుపోతాయి.

'సార్! డైరెక్టర్లందరూ వచ్చారు. బోర్డు మీటింగు టైమయింది' పి.ఎ చెబుతున్నాడు. పదో అంతస్తులోని గాజు గోడలోంచి దూరంగా చూశాను. గద్ద ఆకాశంలో తిరుగుతోంది. ఈ ముంబై మహానగరంలో కూడా కోడి పిల్లలున్నాయా?' నవ్వాపుకోలేకపోయాను.

'ఈసారైనా తల్లికోడి తన పిల్లని పోగొట్టుకోకూడదు. పోరాడి గద్దను తరమాలి' మనసులో కోరుకున్నాను.

★

హ్హా... హ్హా...

పిచ్చి డాక్టర్

పి.డాక్టర్: (మిత్రుడితో) నేను ప్రేమలో పడ్డాన్రా!
స్నేహితుడు: అటు వైపు నుంచి ఓకేనా?
పి.డాక్టర్: ఫెయిలైంది.
స్నేహితుడు: కారణం!
పి.డాక్టర్: నేను రాసిన ప్రేమ లేఖ
స్నేహితుడు: ఏమని రాశావేంటి?
పి.డాక్టర్: 'ఐ లవ్ యు సిస్టర్' అని రాశాన్లే.

గొప్పవారు

అధికారి: మీ ఊళ్లో గొప్పవాళ్లెవరైనా పుట్టారా?
వ్యక్తి: లేదు డాక్టర్. అంతా పిల్లలే.



వికాసం

ఆరోగ్యానికి భరోసా!

ప్రతి ఒక్కరూ అనివార్యంగా వ్యాయామం చేయాలి. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఇవి అందరికీ తెల్సిన విషయాలే. కానీ ఉదయాన్నే లేవడానికి వెయ్యి వంకలు చెప్పేస్తాం. వ్యాయామం మంచిదేగానీ చేసే టైం ఉండడం లేదని కొందరు, ఏ వ్యాయామం తమకు మంచిదో తెలియడం లేదని మరికొందరు పూర్తిగా ఎగనామం పెడుతుంటారు. వ్యాయామం చేయలేకపోవడానికి అనేక కారణాలు చెబుతారు. కారణాలు చెప్పినా, కథలు చెప్పినా ఫలితాలు రావాలంటే మాత్రం వ్యాయామాలు చేయవలసిందే!

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ముందుగా చెప్పుకున్నట్టే వ్యాయామం ఎగ్గొట్టడానికి ఎన్ని వంకలో చూడండి. వ్యాయామం అంటే మాకు భయం. వాటిని ఎలా చేయాలో తెలియదు. అసలు చేసే తీరికే ఉండదు. మీకు తెలీదు నేను చాలా బిజీ. వాతావరణం సహకరించదు. వ్యాయామం ఒక పెద్ద చిరాకు వ్యవహారం. నా లాంటివాడు వ్యాయామం చేస్తే చూసేవాళ్లకి బాగుండదు. అసలు వ్యాయామం అంటే నాకు పెద్ద ఇష్టం ఉండదు. వ్యాయామం చేయమని సలహా ఇస్తే చాలామంది పై విధంగా స్పందిస్తుంటారు. నిజానికి శరీరానికి సరైన ఆహారం వ్యాయామం. ఉదయం వ్యాయామం చేయడం వల్ల రోజంతా తాజాగా, చురుగ్గా, హాయిగా తమ పనులు చేసుకోగల్గుతారు. వ్యాయాయం అంటే చాలామంది దృష్టిలో శరీరం అలసిపోయేవిధంగా నడవడం, సైకిలు తొక్కడం, ఈత కొట్టడం వంటి చర్యలు. ఏ వ్యాయామం చేసినా ఆహ్లాదకరంగా ఉండాలి కానీ శరీరం హింసకు గురికాకూడదు. ఏ వ్యాయామం చేసినా గుండె వేగంగా కొట్టుకునేటట్లు చేయాలి. అవసరమైతే విశ్రాంతి తీసుకుంటూ చేయొచ్చు.

గుర్తుంచుకోవాల్సినవి

శరీరం తట్టుకోగలిగేస్థాయిలో వీలైనంత వేగంగా మైదానాల్లో నడవాలి. కళాశాల ఆవరణలు, అక్కడి ఆటస్థలాల్లో కూడా నడవొచ్చు. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, వాహనాలు ఎక్కువగా తిరిగే ప్రాంతాలు నడక కోసం ఎంపిక చేసుకోకూడదు. నడక, ఈత, సైకిలు తొక్కడం వంటి వ్యాయామాలు చేసేటప్పుడు హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు. పాట పాడుకోవచ్చు. సంగీతం వినొచ్చు. దాదాపు అందరి శరీరాలు నాజూగ్గా ఉండవు. అందవికారంగా కూడా తయారై ఉంటాయి. సాధారణంగా ఎదుటివారి శరీరం చూసి మనం నవ్వుకుంటాం. మన ఆకారాన్ని చూసి ఎదుటివారు నవ్వుకుంటారనే ఆలోచనే రాదు. శరీరం క్రమాకృతిలో ఉండేందుకు వ్యాయామం అవసరం అనుకుంటే, ఒకరు మనల్ని చూసి నవ్వుతారు అనే భావం ఉండదు. వ్యాయామం అనేది ఇరువురి మధ్య పోటీ కాదు. ఎవరి ఆరోగ్యం కోసం వారు చేసేదని గుర్తుంచుకోవాలి. వ్యాయామం చేసే సమయంలో తగిన దుస్తులు ధరించాలి. లేకపోతే దుస్తులు సమస్యగా తయారౌతాయి. ఒకే శరీరతీరు గల వ్యక్తులు కలిసి వ్యాయామం చేస్తుండడం వల్ల ఎన్నెన్నో కొత్త విషయాలు తెలుస్తుంటాయి. ఆహార, విహారాదులు అదుపులో ఉంటే శరీరం ఎలా అందాలు చిందిస్తుందో అర్థమౌతుంది.

బోర్ కొట్టకుండా ...

కొంతమంది ప్రముఖులు వ్యాయామం పేరు చెప్పి స్థిరంగా ఉండే సైకిలు ఇంట్లో తొక్కుతుంటారు. ఇది వారికి పరమబోర్‌గా ఉంటుంది. అందువల్ల తరచూ వ్యాయామం మానేస్తుంటారు.

ఇటువంటి వారు బోర్ కొట్టకుండా కొన్ని చిట్కాలను పాటిస్తే అనుదినం వ్యాయామం చేయగల్గుతారు. సంగీతం వింటూ వ్యాయామం చేయవచ్చు. లేదా టీవీ చూస్తూ కూడా చేయవచ్చు.

నడకను వ్యాయామంగా మలచుకుంటే హెడ్‌ఫోన్స్ తగిలించుకుని సంగీతం వింటూ నడక పూర్తిచేసుకోవచ్చు. ఒంటరిగా నడవొచ్చు. నడిచే ప్రదేశం అనువుగా లేకపోతే అనువుగా ఉండే ప్రదేశం ఎంచుకుని అక్కడికి వాహనం మీద వెళ్లి నడక పని పూర్తి చేసుకోవాలి.

ఎంత పట్టుదలతో వ్యాయామం చేస్తున్నా ఒక్కొక్కసారి అదేపనిగా ఒకే తరహా వ్యాయామం చేయడం విసుగనిపిస్తుంది. అటువంటి పరిస్థితులు ఎదురైతే వ్యాయామం మార్చుకుంటే సుఖంగా ఉంటుంది.

వారం రోజుల్లో చేయవలసిన వ్యాయామాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవచ్చు. రెండు రోజులు నడక, ఒక రోజు సైకిల్, మరోరోజు ఈత, మిగిలిన రోజులు డ్యాన్స్ లేదా ఈ వ్యాయామాలే అనువైన రీతిలో ఎవరికి వారే ఎంచుకుని చేసుకోవచ్చు. ఎలా వ్యాయామం చేసినా అది శరీరానికి ఉపకరిస్తుంది.

స్నేహితులతో కలిసి వ్యాయామం చేయొచ్చు. కబుర్లు చెప్పుకుంటూ చేయొచ్చు. స్నేహితులు చేసినట్లు మీరూ చేయలేకపోతున్నామని ఆందోళన చెందక్కర్లేదు. అలసట కలిగితే కొంత సేపు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత కొనసాగించొచ్చు.

వ్యాయామం మనిషికి ఆహ్లాదం కల్గించేదిగా ఉండాలి. సౌకర్యంతో కూడిన శ్రమ కలిగేటట్లు ఉండాలి. శరీరానికి ఇబ్బంది కల్గించే రీతిలో ఉంటే దానిని చేయకూడదు. ఏ వ్యాయామమైనా శరీరం ఆమోదించినంతవరకు మాత్రమే చేయాలి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

వ్యాయామాలు చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకుంటే శరీరానికి గాయాలు కావు. అవసరమైతే వ్యాయామాలు చేసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యుని సలహాలు అడగడం మంచిది.

కొంతమంది పెద్దవారు నడుస్తుంటే పడిపోతామనే భయంతో ఉంటారు. అటువంటివారు కర్రను ఉపయోగించొచ్చు. తమ ఆత్మవిశ్వాసం మేరకు వ్యాయామం చేయాలి. ఎదుటివారు ఎక్కువసేపు చేస్తున్నారని శక్తి లేక పోయినా ప్రయత్నించకూడదు.

కొన్ని ప్రాంతాల్లో ఒకప్పుడు వాతావరణం మరీ వేడిగాను, మరొకప్పుడు మరీ చల్లగానూ ఉంటుంది. ఇటువంటి ప్రాంతాల్లో నివశించేవారు ఇంట్లో వ్యాయామం చేయడం ఉత్తమం.

స్కూల్లో పనిష్మెంట్‌గా పరుగెత్తించడం, మరికొంతమందికి మిలటరీలో తప్పుకు దండనగా పరుగెత్తించడం వంటి అనుభవాలు మెదడులో వ్యతిరేక ముద్రలు వేస్తాయి. ఇటువంటి వాటినుండి ఎవరికి వారే బయటపడి వ్యాయామం చేయాలి. దానిమీద విముఖతతో మానేయకూడదు.

కొంతమందికి నడుస్తుంటే కాళ్లు నొప్పి పుట్టొచ్చు. మరికొంతమందికి విపరీతంగా చెమటలు పట్టొచ్చు. ఇటువంటి వారు వ్యాయామాలు మార్చుకోవాలి. అంటే చెమటపట్టేవారు ఈతను వ్యాయామంగా ఎంచుకోవడం వంటివి. ఏ వ్యాయామం చేసినా శరీరానికి బాధ కలుగకూడదు. గుర్తుంచుకోండి! ★

అమ్మలకు అమ్మ అమ్మమ్మ

లక్ష్మీదేవమ్మగారు రాసిన 'మా అమ్మమ్మ కథ' చదివాక ఆ పుస్తకం గురించి నాలుగుమాటలు రాయాలనిపించింది. చూసేందుకు చిన్న పుస్తకంలాగానే అనిపించినా చదివాక సూదంటురాయిలా ఆకట్టుకుంది. ప్రతి అక్షరంలోనూ మానవత్వం ఉట్టిపడుతుంది. దుష్టసమాజాన్ని అడుగడుగునా ప్రశ్నిస్తుంది. అన్యాయాలను ఎదిరించాలన్న సందేశం ఇస్తుంది. సమాజమార్పుకోసం ఆక్రోశిస్తున్న ఆమె హృదయం కనిపిస్తుంది. అందులో అమ్మమ్మ కథ మాత్రమే కాదు వర్తమాన సమస్యలనేకం చర్చించారు. వైవిధ్యభరితమైన అనేక అంశాలను హృద్యంగా మలిచారు. ఒక చిన్న పుస్తకంలో ఇన్ని విషయాలను ఎంతో చక్కగా వివరించవచ్చని ఆమె నిరూపించారు. 1971 నుండి 2010 వరకు వారు వివిధ పత్రికలకు రాసిన వ్యాసాలు, కవితలు ఇందులో పొందుపరిచారు. ఈ రూపంలో పుస్తకాన్ని అందించిన లక్ష్మీదేవమ్మగారు అభినందనీయులు.

లక్ష్మీదేవమ్మగారి అమ్మమ్మ జీవితకాలం ఇందులో పేర్కొనకపోయినా బహుశా ఇప్పటికి డెబ్బయిఐదు లేదా ఎనభైఏళ్ల క్రితం అయిఉండొచ్చు. నాడు నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా తెలంగాణాలో ప్రజాస్వామిక భావాలు వికసిస్తున్న రోజులు. నాడు వనపర్తి లాంటి సంస్థానాల్లో పరిస్థితి ఎలా ఉండేదో దాశరథి రంగాచార్య రాసిన 'మోదుగుపూలు, చిల్లర దేవుళ్లు' వంటి నవలల్లో మనకు కనిపిస్తుంది. అలాంటి ప్రభావాలు పరోక్షంగా సమాజంపైనా పడతాయి. అందులో ఒకరు చెన్నమ్మగారు. అంటే లక్ష్మీదేవమ్మగారి అమ్మమ్మ. భావాలు భౌతికపరిస్థితులను నిర్ణయించవు, తద్విరుద్ధంగా భౌతికపరిస్థితుల నుండే భావాలుద్భవిస్తాయన్న మార్క్స్ మాటలు అక్షరసత్యాలని చెన్నమ్మ అనే సామాన్య మహిళ నిరూపించారు. మారుతున్న సమాజం, దానికనుగుణంగా మారాలనుకుంటున్న వారిలో వస్తున్న భావసంఘర్షణ ఇందులో లక్ష్మీదేవమ్మగారు చిత్రీకరించారు. ఆ అమ్మమ్మ ప్రభావంతోనే తాను కూడా రూపుదిద్దుకున్నట్లు లక్ష్మీదేవమ్మగారు ప్రకటించారంటే ఆ భావాలు ఎంత బలంగా ఉంటాయో మనం ఊహించుకోవచ్చు. ఆ పునాదితోనే తాను కమ్యూనిస్టునయ్యానని కూడా ఆమె గర్వంగా చెప్పుకున్నారు.

లక్ష్మీదేవమ్మగారు తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని ఆచరణ ద్వారా నిరూపించారు. ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేలు తలపెట్టవోయ్ అన్న గురజాడ సూక్తి ఆమెను చిన్నతనంలోనే ప్రభావితం చేసింది. తన కుటుంబాన్ని యావత్తూ కమ్యూనిస్టు లేదా అభ్యుదయభావాలతో తీర్చిదిద్దేందుకు ఆమె ప్రయత్నించడమే కాదు సఫలమయ్యారు కూడా. తానే ఇప్పుడు ఒక అమ్మమ్మ. అనేకమంది అమ్మలకు అమ్మ. పిల్లలను ఎలా తీర్చిదిద్దాలో ఆమె చెప్పిన తీరు, చిట్కాలు చాల గొప్పవి. పిల్లలను ఎలా పెంచాలి? అంటూ చైతన్యమానవి పత్రికలో రాసిన వ్యాసం ఇలాంటి కొన్ని చిట్కాలను మనకు అందిస్తుంది. కుటుంబ బాధ్యత, సామాజిక స్పృహతో కూడిన పిల్లల పెంపకం వారి భవిష్యత్తుకే కాదు సమాజ భవిష్యత్తుకూ అవసరమంటారు లక్ష్మీదేవమ్మగారు. భర్తలకు ఎదురు తిరిగి సాధించలేని పనిని బిడ్డల పెంపకంలో జాగర్తలు పాటించి వారిని భావిపౌరులుగా తీర్చిదిద్దితే మరో పొగరుబోతు భర్త, ఆరళ్లుపెట్టే అత్త పుట్టరని చెప్తారు. స్త్రీ, పురుష సంబంధాల గురించి బహిరంగంగా మాట్లాడటానికే భయపడే రోజుల్లో నిర్భయంగా తన భావాలను 'స్త్రీకి స్వేచ్ఛ' అనే పేరుతో ప్రగతి పత్రికకు రాసిన వ్యాసంలో వెల్లడించారు. తన మరదలిని ఎదిరించడానికి ప్రోత్సహించారు. హేతువాదభావాలను ప్రచారం చేశారు. దేవుడిగుడిలో గంటలు కాదు మోగించాల్సింది పేదవాడి గుండెలో ఆకలిమంటలు ఆర్పాలన్న సందేశం ఇచ్చారు. మగవాళ్లే కాదు ఆడవాళ్లూ తలకొరివి పెట్టొచ్చునంటూ సంప్రదాయాలపై తిరుగుబాటు చేసి తన తల్లికి తానే కొరివి పెట్టారు. సామాజిక రుగ్మతలకు స్త్రీ,పురుష తేడా లేకుండా అందరూ గురవుతున్నారు. అందరూ దీనికి బాధ్యత వహించాలంటూ రోగుల పట్ల సిస్టర్స్ ఎలా వ్యవహరించాలో బోధించారు. ఆపదలో ఉన్న రోగికి ఆమె మాటలే అమృతం కావాలన్నారు. నర్సులు మందులతో పాటే మమతనూ పంచాలన్నారు. నేటి యువతను సినిమాలు ప్రభావితం చేస్తున్న తీరుపై బాధపడుతూనే చెడ్డసినిమాలు చూసి డబ్బు, అంతకన్నా ముఖ్యమైన సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. కరువుకోరల్లో చిక్కుకున్న మహబూబ్‌నగర్ జిల్లాలో ఆకలిచావులు చూసి చలించిపోయిన ఆమె ప్రత్యక్షంగా రంగంలో దిగి ఆపన్నహస్తమందించారు. మానవతకు వర్గపోరాటాన్ని జోడించి నడిచారు. అందరూ పెళ్ళిళ్లయ్యాక హనీమూన్ వెళతారు. కాని పాలమూరు జంటలు పొట్టకూటికోసం, అప్పులు తీర్చడానికి వలసలు పోతారని విన్నప్పుడు ఎవరైనా చలించిపోతారు. పండగలొస్తున్నాయంటే చిన్నప్పుడు పొంగిపోయేవారం కాని ఇప్పుడు భయపడుతున్నాం అంటున్న పాలమూరు కరువుకోరల్లో నలిగిపోతున్న జనం మాటల్ని ఆమె ప్రస్తావించారు. భర్త చనిపోయిన తర్వాత మరో వివాహం చేసుకుంటే ఆస్థిపై ఆమెకున్న హక్కు పోతుందని, దాన్ని మార్చాలని ఒక వ్యాసంలో వాదించారు. నాలుగైదేళ్ల క్రితం సుప్రీంకోర్టు ఈ దిశగా ఇచ్చిన తీర్పు బహుశా ఆమె కోర్కెకు ఉపశమనం కావచ్చు. స్త్రీలు తమ పురోగతిని అడ్డుకునే శక్తులతో ఘర్షణ పడుతూ ముందుకు సాగాలన్న సందేశం ఈ తరానికి ఉపదేశం కావాలని కోరుకుంటున్నాను. పెద్దవాళ్లు కొత్తతరానికి అందించాల్సిన వారసత్వ సంపదలో అత్యున్నతమైంది జ్ఞానసంపద. అవి జ్ఞాపకాల రూపంలో అందరినీ అలరిస్తాయి. మా అమ్మమ్మ కథ పేరుతో వెలువడ్డ ఈ చిరుపొత్తం ప్రతి ఒక్కరినీ అలరిస్తుందని ఆశిస్తున్నాను. తప్పక చదివి తీరాల్సిన పుస్తకం.

మా అమ్మమ్మ కథ- ఎన్.ఎస్.లక్ష్మీదేవమ్మ వెల : అమూల్యం, పేజీలు : 55.

- వి.శ్రీనివాసరావు

కొత్త పుస్తకాలు



TOOTH CARE& ORAL HEALTH
Dr. M.S.Gowd,
Dr.G.Dhandapani
Price : 120/-,
pages : 201
For copies :
any book shop



THE PEOPLE'S MARX
JULIAN BORCHARDT
Price : 200/-,
pages : 419
For copies :
Prajasakti book house
MH.Bhavan, plot
no21/1, Azamabad,
Near RTC kalyana
mantapam, HYD-20.



డి. తేజస్వి,
6వ తరగతి,
అభ్యుదయా హై స్కూల్,
హైదరాబాద్.

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

చెప్పుకోండి

హాయ్... పక్కనున్న పిడుగు ఎవరో తెలుసా? మీకు చిన్న క్లూ. ఇప్పుడు ఇతనో పెద్ద బాలీవుడ్ స్టార్. అంతేకాదు ఇతని కుటుంబంలోని వారంతా సినీ నటులే. కాకపోతే ఇది అతని చిన్నప్పటి ఫొటో. ఇప్పుడు చెప్పండి ఇతను ఎవరో?

చిన్న సాయం

- మేకల మదన్‌మోహన్‌రావు

బాల కథ

ఒక వూళ్లో తల్లీ కొడుకు ఉండేవారు. వాళ్లు చాలా బీదవాళ్లు. కొడుకు పేరు రాములు. అతను అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొచ్చి వాటిని అమ్మేవాడు. అలా వచ్చిన డబ్బుతో కావలసినవి తెచ్చుకునేవాళ్లు. ఎప్పటిలాగే ఆ రోజూ అతనో చెట్టు నరకబోయాడు. అంతలో దానిమీద నివాసమున్న ఒక పెద్ద పక్షి కిందికి దిగి అతని దగ్గరికి వచ్చింది. "బాబూ! ఇది నివాసం ఉండే చెట్టు. దయచేసి దీనిని నరకొద్దు" అని ప్రాధేయపడింది. అతనికి పక్షిని చూస్తే చాలా జాలేసింది. సరేనని చెప్పి ఆ చెట్టును నరకడం మానుకున్నాడు. పక్షి సంతోషించి "రేపు ఉదయం ఒక పెద్ద గోనె సంచి తీసుకుని ఇక్కడికి రా" అని చెప్పింది. పక్షి చెప్పినట్లే మర్నాడు రాములు పెద్ద గోనె సంచిని తీసుకుని ఆ చెట్టు దగ్గరికి వచ్చాడు. "నువ్వు నా తోక గట్టిగా పట్టుకో" అంది పక్షి. అతను అలాగే చేశాడు. అది రివ్వున గాల్లోకి ఎగిరి చాలా దూరానున్న ఒక లోయలోకి తీసుకెళ్లింది. ఆ లోయనిండా బంగారమే. రాములు వెంట తెచ్చుకున్న సంచినిండా అక్కడున్న బంగారం నింపుకున్నాడు. పక్షి అతన్ని వెనక్కి తీసుకొచ్చి ఇంటిదగ్గర దింపి వెళ్లిపోయింది. ఆ బంగారంతో రాములు ఒక వ్యాపారం ప్రారంభించాడు. తర్వాత అతను తన కుటుంబంతో సంతోషంగా జీవించాడు.



నీతి : దయతో కూడిన చిన్న సాయం సైతం ఎప్పటికైనా గొప్ప ఫలితాన్నిస్తుంది

తేడాలు ఏవి?

పిడుగులూ! ఈ రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి. కానీ అందులో 9 తేడాలున్నాయి. వాటిని గుర్తించండి.

పూలెన్ని?

ఒక వ్యక్తి కొన్ని పూలు తీసుకుని ఒక గుడికి వెళ్లాడు. గుడి ముందు కోనేట్లో ఆ పూలను వేయగానే అవి రెట్టింపయ్యాయి. వాటిలో కొన్ని మొదటి గుళ్లో ఇచ్చి మిగిలిన వాటిని మళ్లీ కోనేట్లో వేశాడు. అవి మళ్లీ రెట్టింపయ్యాయి. వాటిలో కొన్ని రెండో గుళ్లో ఇచ్చాడు. మిగిలిన వాటిని తిరిగి కోనేట్లో ముంచి తీస్తే మళ్లీ అతని చేతిలో ఉన్నవాటికి రెట్టింపయ్యాయి. ఉన్న మొత్తం పూలని మూడో గుళ్లో ఇచ్చాడు. అయితే మూడు గుళ్లలో పూలు సమానంగా ఇచ్చాడు. ఇంతకీ అతను మొదట తీసుకెళ్లిన పూలు ఎన్ని? ప్రతి గుళ్లో ఎన్నెన్ని పూలు ఇచ్చాడు?

జవాబు : 7 పూలు తీసుకెళ్లి కోనేరులో వేస్తే అవి 14పూలు (అంటే రెట్టింపు) అవుతాయి. వాటిలో 8 పూలని మొదటి గుళ్లో ఇవ్వాలి. మిగిలిన 6 పూలని మళ్లీ కోనేట్లో వేస్తే 12 పూలు అవుతాయి. వాటిలో 8 పూలని రెండో గుళ్లో ఇవ్వాలి. ఇప్పుడు 4 పూలు మిగులుతాయి. వాటిని కోనేట్లో వేస్తే 8 పూలవుతాయి. వాటిని మూడో గుళ్లో ఇవ్వాలి. చివరికి ఏమీ మిగలవు.



దారి ఏది?

చిన్నారులూ...! కిందున్న చిట్టెలుక తన కలుగులోకి వెళ్లాలని బయలుదేరింది. అక్కడికెళ్లాలంటే మధ్యలో బోలెడన్ని గజిబిజి దారులున్నాయి. ఇంకా దాన్ని పట్టడానికి బోను కూడా పెట్టారు. ఏ దారిగుండా వెళ్తే ఎలుక ఆ బోనులో పడకుండా, త్వరగా తన ఇంటికి చేరుకోగలదో చెప్పండి.

సిరిపిట్ట



ఈ వారం మన ముందుకొచ్చిన పక్షి సిరిపిట్ట. ఇది ఊరపిచ్చుక కంటే కొంచెం చిన్నగా ఉంటుంది. దీని శరీర పై భాగం నీలిరంగులో, కింది భాగం ముదురు చెస్నటు రంగులో కనిపిస్తుంది. దీనికి ముక్కు పొడుగ్గా కొనదేలి ఉంటుంది. కవచాలున్న గింజలను తమ బలమైన ముక్కుతో పగలకొట్టి తింటాయి. ఇవి భారత దేశమంతటా చెట్టడవుల్లో కనిపిస్తాయి. చిట్టెలుకల్లాగా కొమ్మలపైకి పాకుతుంటాయి కూడా. ఇవి ఒంటరిగాగానీ, జంటగాగానీ కనిపిస్తుంటాయి. ఆహారాన్ని వేటాడేటప్పుడు చెట్టుకొమ్మ అడుగుతలాన్ని పట్టుకుని తలకిందులుగా చాలా వేగంగా పరుగెత్తగలవు. ఈ పక్షులు రెండు రకాలుగా అరుస్తాయి. ఒక్కోసారి వీటి అరుపు చిట్టెలుక అరుపులా చాలా నీరసంగా వినిపిస్తుంది. అంతలోనే శ్రావ్యమైన గొంతుతో ఈలపాటలు పాడుతాయి. చెట్లలో సహజంగా ఏర్పడిన తొర్రల్లో నివాసం ఏర్పాటుచేసుకుంటాయి. మెత్తగా ఉండడానికి అందులో నాచు, ఆకులను తెచ్చి పరుచుకుంటాయి. సహజంగా చెట్టు తొర్రలంటే కొంచెం పెద్దగా ఉంటాయి కదా. ఈ పక్షులు అవి పట్టే రంధ్రం మాత్రమే ఉంచి మిగిలిన భాగమంతా తడి మట్టితో మూసేస్తాయి. ఎంత తెలివో!

కనిపెడతారా!

నేస్తాలూ... పక్కనున్న బొమ్మలో కొన్ని వస్తువులు, తినుబండారాలు, పక్షులు, జంతువులు ఉన్నాయి. వాటి ఆకారాలు కిందున్న చిన్న బాక్సులో ఉన్నాయి. వాటిని పై బొమ్మలో ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. మరి త్వరపడండీ!

మాటల కోట - 64

రూపకల్పన : కర్లపాలెం



అడ్డం :

1. గాలి జనార్ధన రెడ్డి అనగానే గుర్తొచ్చేవి (3)
3. కంచిని సాగదీస్తే (4)
5. కవిత్వమే కాదు... పాత సినిమా నాయిక కూడా (3)
6. ఆంధ్రప్రదేశ్‌లో సైనిక స్కూలు ఉండే కొండ (4)
7. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళాకారులకు ఇచ్చే పురస్కారాలది ఈ రూపమే (2)
8. 'నామిని సుబ్రహ్మణ్యం నాయుడు' రచన.... సాక్షిగా(4)
11. కౌమారంలో యువకులకు వచ్చే మీసాలు (3)
13. అనగనగా ఒక పల్లి (3)
14. ఎలాబడితే అలా విలపించు (4)
16. శిబిరంలోని చక్రవర్తి (2)
17. దుఃఖమును విచారించు (4)
19. యజ్ఞంలో వ్రేల్చే దర్భ (3)
20. అలని సాగతియ్యి! (4)
21. ప్రాణుల్లో ఉండేవి (3)

నిలువు :

1. కపాలం ముందు భాగం (3)
3. మునిమాణిక్యం గారి హీరోయిన్ (2)
4. నిర్మాణం అడుగు భాగం (3)
5. వై.ఎస్ జగన్ నియోజక వర్గం (3)
6. అత్యంత విలువైన వజ్రం (4)
7. శకునం తిరగబడింది (3)
9. ముద్దులు ద్దులుము అయితే ముచ్చట? (3)
10. భాగ్యము లేని హైదరాబాదు (4)
12. రోజా పూవు (3)
15. అనేక (3)
16. చక్రవర్తితో సహా 16 అడ్డం (3)
18. ఒక చోటినుండి మరో చోటికి చేరవేయడం (3)
19. మూడు వంతుల 'మాసము'లో చివరి రెండువంతులు (2)

మాటలకోట - 63 జవాబు

1 పం	చ	2 దా	ర		3 వె		4 రా	ణి
ట		రం		5 అ	న్న	6 దా	త	
			7 గ	చ్చ		నం		8 శి
9 రో		10 క	ట్టు		11 పా		12 యు	వ
13 సా	14 వి	త్రి		15 భ	వ	న	ము	
16 భ	స		17 న	ర్త	న			18 దా
	19 వే	20 కు	వ		ము		21 ఆ	శ
22 యా		ర				23 తాం	ద	ర
24 స	హ	చ	రి		25 పై	డి		ధి

హ్హా... హ్హా...

టీ...తో

విజయ్: ఒరే కొత్తగా కారు కొన్నావంటగా. పేరేంటి?

అజయ్: ఆ...పేరు గుర్తులేదురా. అది 'టి'తో స్టార్ట్ అవుతుంది.

విజయ్: వావ్. పెట్రోల్‌తో నడిచే కార్లు చూశాం గానీ...టీతో నడిచే కారా? బావుందే.



సర్టిఫికెట్

పిల్లవాడు: అమ్మా... మనం ఎంత చదువుకుంటే అంత సర్టిఫికెట్ ఇస్తారుకదా.

తల్లి: అవును కన్నా.

పిల్లవాడు: కానీ మనం ఎప్పటికీ చూసుకోలేని సర్టిఫికెట్ ఏదమ్మా...

తల్లి: ఏంటది?

పిల్లవాడు: డెత్ సర్టిఫికెట్



పెట్

"అమ్మా...మరీ...నాకు...పుట్టినరోజు బహుమతిగా ఏమిస్తావ్?" అడిగాడు సమీర్. పదకొండో ఏడు నిండి పన్నెండో సంవత్సరంలోకి అడుగెట్టబోతున్నాడు. ఆ రాత్రి కూడా ఎప్పటిలాగే అమ్మతో కథ చెప్పించుకున్న తర్వాత మెల్లగా మనసులోని మాటను బయటపెట్టాడు.

"ఏం కావాలి కన్నా...అడుగు!" అంది అమ్మ. తల్లి నోటి నుంచి వచ్చిన ఆ మాటలు వాడికి ఎంతగానో నచ్చాయి. అమ్మ అలా అంటుందని ఆ చిన్నారికి తెల్సు. అందుకే వాడికి అమ్మంటే అంత ఇష్టం.

"మరీ...మరీ నేను అడిగాక తప్పనిసరిగా ఇవ్వాలి. సరేనా!"

"ముందు చెప్ప నాన్నా!"

"నాకు ఏదైనా పెట్ కావాలమ్మా... పిల్లిపిల్ల, కుక్కపిల్ల, చిలుక, కుందేలు, పావురం, చేపపిల్ల...ఏదో ఒకటి పెంచుకోవాలని వుంది...ఆ బన్నీగాడు చూడు వాళ్లకేగానీ కుక్కపిల్ల వుందని ఎంత బడాయిపోతాడో! నాకూ పెట్ కావాలమ్మా..."

"పెట్ ... కావాలా! సరే...చూద్దాంలే...ముందు నువ్వు పడుకో. పొద్దున్నే లేచి స్కూలుకెళ్లాలిగా..." అంది. ఆ మాటకే వాడు ఒక్క ఉదుటున లేచి వచ్చి తల్లిని చుట్టేసి చిట్టి ముద్దు పెట్టేశాడు.

కానీ అదంతా కుదరని పనని ఆమెకు తెలుసు. అంతక ముందర కూడా వాడు ఎన్నోమార్లు ఈ ప్రస్తావన తేవడం నెమ్మదిగా సర్దిచెప్పడం జరిగిపోయింది. ఆ లేత మనసులో మాత్రం పెట్‌ను పెంచుకోవాలన్న కోరిక అలాగే వుందనడానికి వాడి మాటలే నిదర్శనంగా అనిపించాయామెకు. వాడి చిన్ని కోరికను తీర్చలేకపోతున్నానన్న బాధ మనసు నిండా పరచుకుంది. ఆమె కారణాలు ఆమెవి. తామిద్దరూ ఉద్యోగస్తులు కావడంతో ఇల్లు చేరేసరికి రాత్రవుతుంది. ఇంక పెట్ గురించి పట్టించుకునేదెవరు?! పోనీ ఇంట్లోనే వదిలేసి వెళదామా అంటే ...అది ఒకటీ రెండూ ఇంట్లోనే చేస్తే కష్టంకదా. పైగా దానికి తిండీ తిప్పలు, నీళ్లు పెట్టేదెలా! అన్నిటినీ మించి అద్దె ఇంట్లో ఇవన్నీ కుదిరేవేనా! ఇంటి ఓనర్స్‌తో ఎన్ని సమస్యలు?! అవన్నీ వాడికి చెప్పినా అర్థంకావు!

"చూద్దాంలే..." అని తనన్న ఒక్కమాటతో ఎంతో సంతోషంగా నిద్రలోకి జారుకున్న సమీర్‌నే చూస్తూ గతంలోకి వెళ్లింది తల్లి.

సమీర్ ఫస్టు క్లాసులో వున్నప్పుడు స్కూలయ్యాక ఎప్పటిలాగే ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో చెట్ల మీద వాలిన సీతాకోకచిలుకలు వాడిని ఆకర్షించాయి. ఒక్క సీతాకోకచిలుకనైనా పట్టుకుని ఇంటికి తెచ్చుకోవాలన్నది ఆ చిన్ని మనసు కోరిక. చేతిలోని లంచ్‌బాస్కెట్‌ని కింద పెట్టి వాటి వెంటే నడిచాడు. అలా సీతాకోకచిలుకల వెంట పడి ...పడి... చివరికి ఒక్కదాన్ని కూడా పట్టుకోకుండానే...నీరసంగా ఇల్లు చేరాడు. అయితే ఆ లంచ్‌బాస్కెట్‌ని అక్కడే మర్చిపోయాడు. తను అడిగినప్పుడు నాలుక కరుచుకున్నాడు.

ఓసారి ఎంత వద్దన్నా వినకుండా స్కూలు నుంచి వస్తూ వస్తూ రెండు చేప పిల్లలను కొనుక్కొచ్చాడు. ఎరుపు, బంగారు వర్ణాల్లో ఎంత బావున్నాయో! అయినా వీడికి డబ్బులెక్కడివి? వాటిని చూసుకోవడం ఎలా! తన భావాలు గమనించి "అమ్మా... పొద్దున నాన్ననడిగి డబ్బులు తీసుకున్నానమ్మా ఒక్కో చేప పిల్ల ఖరీదు ఐదు రూపాయలే... వాటికి పెట్టే ఫుడ్ కూడా ఐదు రూపాయలే. ఒక పెద్ద జార్ వుంటే చాలు. ఎంచక్కా పెంచుకోవచ్చు... ఫిష్ జార్‌లో నీళ్లు రోజూ నేనే మారుస్తాగా. అవి అలా మన ఇంట్లో టేబుల్ మీద సీసాలో ఆడుకుంటుంటే చాలా బావుంటుందమ్మా...పెద్దగా పెరిగితే వాటిని పెద్ద సీసాలోకి మారుద్దాం. సరేనా..." అంటూ తనను ఒప్పించడానికి ప్రయత్నించాడు. ఇక తీసుకొచ్చాక ఏంచేస్తాం? ఒకటి రెండు రోజులు ఉత్సాహంగా చేపలకు నీళ్లు మార్చడం, ఆహారం పెట్టడం చేశాడు. తర్వాత్తర్వాత స్కూలుకెళ్లే హడావిడిలో ఆ పనులు చేయడానికి వాడికి కుదిరేదే కాదు. ఆ పనులన్నీ తనమీదే పడ్డాయి. చేప పిల్లలు పదిరోజులు బానే వున్నాయి. పదకొండోరోజు ఉదయం చూస్తే ఏముంది! గాజు జాడీలోంచి ఒక చేప బయటపడి చనిపోయింది. ఆ తర్వాత రెండు రోజులకే రెండోదీ బాల్చీ తన్నేసింది. అప్పుడు సమీర్ ఎంతగా దిగాలుపడిపోయాడో ఇప్పటికీ గుర్తే. ఆ చనిపోయిన చేపలను గుంట తీసి పూడ్చిపెట్టాడు. పైగా అక్కడ ఒక పువ్వు కూడా పెట్టాడు.

కొద్ది రోజులపాటు పెట్ గురించి మాట్లాడలా. ఆ తర్వాత మళ్లీ మొదలెట్టాడు. ఇప్పుడైతే పుట్టినరోజు సందర్భంగా ఎలాగైనా పెట్ సంపాదించాలని పట్టుదలగా వున్నాడు. ఏం చేయాలి?! వాడి మనసు నొప్పించకుండా ఒప్పించడం ఎలా? ఆలోచనలతోనే నిద్రలోకి జారుకుంది.

తెల్లారి లేవగానే తలస్నానాలు, కొత్తబట్టలు, పాయసాలు, చాక్లెట్లు ..అన్నీ అయ్యాక వాడిని దగ్గరకు పిల్చి...

"కన్నా! నువ్వు పెట్ కావాలని అడిగావుగా..."

"అవునమ్మా..." మెరుస్తున్న కళ్లతో అన్నాడు.

"నీకు ఏది కావాలి?! కుక్క, పిల్లి, చిలుక, కుందేలు, పావురం...ఏది కావాలి?!'

"అమ్మా...నా పెట్ ఎప్పటికీ నాతోనే వుండాలి. నేను ముసలివాణ్ణయ్యేవరకు నాతోనే వుండాలి. ఇప్పుడు నువ్వు చెప్పావే అవేవీ అన్ని రోజులు బతకవు. మొన్న మా నేస్తాలు చెప్పుకుంటుంటే విన్నా, తాబేలయితే చాలా సంవత్సరాలు బతుకుతుందట. బుల్లి తాబేలు పిల్లను పెంచుకుందామమ్మా..." అన్నాడు ఎంతో ఉత్సాహంగా.

"నాన్నా సమీర్ ... నీ ఐడియా చాలా బావుంది. అసలు నాకు తట్టనేలేదే! తాబేలును పెంచుకోవాలంటే ఏమేం కావాలో తెల్సా! చాలా పెద్ద పెరడు వుండాలి. అందులో చిన్నపాటి నీళ్ల గుంట ఏర్పాటుచేయాలి. అంటే మనకు సొంత ఇల్లు వుండాలన్నమాట. అప్పుడు కొనుక్కుందామే తాబేలు పిల్లని. ఇప్పటికైతే మనం రెండు పావురాళ్లను తెచ్చుకుందాం. ఎంచక్కా మన అపార్ట్‌మెంట్లో చాలా గూళ్లున్నాయికదా. వాటిలో వుంటాయి. సరేనా?!"

"అమ్మా...మరీ...నాకేమో తాబేలు పిల్లను పెంచుకోవాలని వుంది...కానీ నువ్వు చెప్పినవన్నీ విన్నాకేమో ఇప్పుడే ఒద్దనిపిస్తుంది. సరే అమ్మా...నువ్వు చెప్పినట్టే చేద్దాం..ఇప్పటికైతే పావురాళ్లను కొనుక్కొద్దాం. మనం సొంత ఇల్లు కొనుక్కున్నాక మాత్రం తాబేలు పిల్లను తెచ్చుకోవాల్సిందే. ఓకేనా?!" అన్నాడు ఎంతో సంతోషంగా.

వాడి మొహంలో మెరుపును, సంతోషాన్ని చూసి ఆ తల్లి మొహం కూడా వెలిగిపోయింది.

-కె. అంజన

అదిరె... అదిరె...



వెండితెర అంటేనే వెరైటీకి వేదిక. ఎందరో తారలు ఎన్నెన్నో పాత్రల్లో, వేషాల్లో ప్రేక్షకులను మెప్పిస్తుంటారు. వీటిలో మగవారు మహిళల వేషం వేయడమనేది ప్రత్యేకాకర్షణ. నాడు ఏఎన్నార్, ఎన్టీఆర్, పద్మనాభం, రేలంగి వంటి వారెందరో వేశారు. నేడు కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ... తదితరులను చూశాం. తాజాగా 'వాడే వీడు, కాంచన' చిత్రాల్లో విశాల్, లారెన్స్‌ను చూస్తున్నాం. ఈ సందర్భంగా ప్రముఖ తారలు వేసిన లేడీ గెటప్పులను మీ ముందు ఉంచుతున్నాం. గుర్తించండి చూద్దాం. సర్సరి! మీకు అంత శ్రమ ఎందుకుగానీ...మేమే చెప్పేస్తాం. కమల్‌హాసన్, అల్లు అర్జున్, విక్రమ్, రాజేంద్రప్రసాద్, శరత్‌కుమార్, బాలకృష్ణ, విశాల్, నరేష్, వడివేలు, లారెన్స్. ఇప్పుడు గుర్తుపట్టేశారా!